



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 181 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా ఆదివారం 12 జూలై 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 181 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, SUN 12 JULY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## 40 ఏళ్ల నిరీక్షణకు తగిన ఫలం.. మోదీ రాక చరిత్రాత్మకం

- 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న భారత ప్రధానిగా మోదీ ఘనత
- మోదీ రాక కోసం ఎదురుచూశామని, ఇది చరిత్రాత్మకమని వ్యాఖ్యానించిన కివీస్ ప్రధాని
- మోదీ నాయకత్వంలో భారత్ అద్భుత ప్రగతి సాధించిందని ప్రశంస
- 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశారని కొనియాడిన లక్సన్
- 21వ శతాబ్దం భారత్‌దేనని, కలిసి పనిచేస్తామని స్పష్టీకరణ

- మిగతా 2లో



## ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

- ఏఐ యుద్ధాలు చేసినా గెలిచేది సైనికులేనన్న రాజ్‌నాథ్
- విశాఖలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి నౌకాదళంలోకి ప్రవేశం
- సంప్రదాయ, ఆధునిక సైనిక శక్తి మధ్య సమతుల్యం అవసరం
- యుద్ధనౌకల నిర్మాణంతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు
- 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'తో ప్రపంచ హబ్‌గా భారత్

పెన్ పవర్ డెస్క్:ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన సాంకేతికతలు యుద్ధ స్వరూపాన్ని మారుస్తున్నప్పటికీ,

- మిగతా 2లో





## "పల్లి పల్లి మినిస్టర్"..

### విజయవంతంగా ముగిసిన మంత్రి లోకేశ్ కొరియా పర్యటన

- వారం రోజుల్లో 50కి పైగా కంపెనీలతో పెట్టుబడుల కోసం చర్చలు
- ఎల్జీ, హ్యుందాయ్, శాంసంగ్ వంటి దిగ్గజ సంస్థల సానుకూల స్పందన
- బుసాన్‌లో ఏపీ పెట్టుబడిదారుల సహాయక కేంద్రాన్ని ప్రారంభించిన లోకేష్
- లోకేశ్ వేగాన్ని చూసి 'పల్లి పల్లి' (త్వరగా త్వరగా) మంత్రి అని ప్రశంసించిన కొరియన్లు

- మిగతా 2లో



## ఆ హంతకుడికి జగన్‌కి దగ్గరి పోలికలు ఉన్నాయి

- వైసీపీకి రాజకీయ పార్టీ లక్షణాలు లేవన్న సీఎం చంద్రబాబు
- గొడ్డలి, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ ప్రధాన అస్త్రాలని విమర్శ
- కడప స్టీల్ ప్లాంట్ పేరుతో లక్షల కోట్ల సంపద ఆవిరైందని ఆరోపణ
- తెలంగాణ ఆరు హత్యల హంతకుడి మనస్తత్వానికి, జగన్ వైఖరికి దగ్గరి పోలికలున్నాయని వ్యాఖ్య
- సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టుల కట్టడికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్: వైసీపీకి ఒక రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు ఏమాత్రం లేవని, అదొక గొడ్డలి పార్టీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గొడ్డలి, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ అస్త్రాలని, వారి చరిత్ర మొత్తం రక్త చరిత్రేనని విమర్శించారు. తెలంగాణలో ఆరుగురిని కిరాతకంగా హత్య చేసిన హంతకుడి మనస్తత్వానికి, జగన్ వైఖరికి చాలా దగ్గరి

- మిగతా 2లో

## వియత్నాంలో ఘోర ప్రమాదం..

## ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక... 15 మంది మృతి




- వియత్నాంలో భారత పర్యాటకులతో వెళ్తున్న స్పీడ్‌బోట్ బోల్తా
- ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం
- ఫు క్వాక్ దీవి సమీపంలో అదుపుతప్పిన పడవ
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం

వివరాలు 2లో..

వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్‌బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ దీవి సమీపంలో శనివారం ఉదయం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం కారణంగా ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం.

| | |
|---|---|
| మృతి చెందిన వారు | 15 మంది |
| రక్షించిన వారు | 21 మంది (గాయాలు) |
| గల్లంతైన వారి కోసం | గాలింపు కోనసాగుతుంది |

### వివరాలు

- ఒక మొబైల్ కంపెనీ తరపున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు.
- వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు.
- మృతుల్లో మచిలీపట్నంకు చెందిన గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు.
- గిల్లి కిశోర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

### రంగంలోకి దిగిన సహాయక బృందాలు

- స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.
- ఇప్పటివరకు లిలి21 మందిని రక్షించారులిలి.
- క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నారు.
- గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.



### భారత ఎంబసీ ప్రకటన

ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపింది. బాధితుల కుటుంబాలకు సహాయం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది.




**హెల్ప్‌లైన్ నంబర్లు**

| +84 36 281 7930 | +84 91 552 37 14 | +84 33 452 0414 | +84 91 308 9165 |
|---|---|---|---|
| హో చి మిన్ సిటీ | హో చి మిన్ సిటీ | హనోయ్ | హనోయ్ |

భారతీయ పర్యాటకులు ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.



## హెలికాప్టర్ ఆపితే.. రైల్లో వస్తారు

### జగన్ భీమవరం పర్యటనపై పేర్ని నాని

- జగన్ భీమవరం పర్యటనను కూటమి ప్రభుత్వం అడ్డుకోలేదన్న పేర్ని నాని
- హెలిప్యాడ్‌కు పర్మిషన్ ఇవ్వకపోతే జగన్ రైలు ఎక్కైనా వస్తారని వ్యాఖ్య
- ఆక్వా రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ

- మిగతా 2లో

## ధవళేశ్వరం మరింత పటిష్ఠం...

### కొత్తగేట్లు అమర్చే పనుల్ని ఈనెల 13న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

- ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త గేట్ల ఏర్పాటుకు శ్రీకారం
- రూ.153 కోట్లతో 117 పాత గేట్ల స్థానంలో కొత్తవి
- ఈనెల 13న పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- పిచ్చుకలంకలో రైతులతో భేటీ, పోలవరం ప్రాజెక్టు పరిశీలన
- సీడబ్ల్యూసీ సిఫార్సుల మేరకు బ్యారేజీ ఆధునికీకరణ

పెన్ పవర్ డెస్క్: ఉభయ గోదావరి జిల్లాలకు జీవనాడిగా, లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందిస్తున్న సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ ఆధునికీకరణకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాలం చెల్లిన పాత గేట్ల స్థానంలో కొత్తవి అమర్చే పనులను ఈ నెల 13న ముఖ్యమంత్రి

- మిగతా 2లో



## గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

- తెలంగాణ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందన్న అశ్వినీ వైష్ణవ్
- హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి
- తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు

- మిగతా 2లో

## బెంగాల్‌లో సౌరవ్ గంగూలీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం.. రూ.2,500 కోట్ల ప్రాజెక్టులో జాప్యం



- పశ్చిమ బెంగాల్‌లో సౌరవ్ గంగూలీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం ఆలస్యం
- గతంలో ఆయన చెప్పిన గడువు సమీపిస్తున్నా ప్రారంభం కాని ఉత్పత్తి
- రూ.2,500 కోట్ల పెట్టుబడితో కెప్టెన్ స్టీల్‌తో కలిసి ఈ ప్లాంట్ నిర్మాణం
- ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 6,000 ఉద్యోగాలు వస్తాయని అంచనా

పెన్ పవర్ డెస్క్:భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన భారీ ఉక్కు పరిశ్రమ (స్టీల్ ప్లాంట్) నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొంది. గంగూలీ గతంలో ప్రకటించిన గడువు సమీపిస్తున్నప్పటికీ, వాణిజ్యపరమైన ఉత్పత్తి ఇంకా ప్రారంభం కాలేదు. పశ్చిమ మిడ్నాపూర్

- మిగతా 2లో



## మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు

### మొజ్తబా ఖమేనీ ప్రకటన

- తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ప్రతిజ్ఞ
- అమెరికా-ఇజ్రాయెల్ దాడిలోనే తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం
- హంతకులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని టెలిగ్రామ్‌లో హెచ్చరిక
- ఫిబ్రవరి దాడిలో గాయపడిన మొజ్తబా.. తండ్రి అంత్యక్రియలకు దూరం

- మిగతా 2లో

## సీఎం రేవంత్ ను కలిసిన ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్

- రేవంత్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మహమ్మద్ సార్దన్
- రాష్ట్రానికి ఎమిరేట్స్ సేవలను పెంచాలని కోరిన రేవంత్
- రాష్ట్రానికి రెండు కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయని చెప్పిన సీఎం

- మిగతా 2లో




## లెజెండరీ సింగర్ ఎస్. జానకి కన్నుమూత

పెన్ పవర్ డెస్క్: సినీ సంగీత పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. లెజెండరీ సింగర్ ఎస్. జానకి కన్నుమూశారు. గతకొంత కాలం గా వయోభారం, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధ పడుతోన్న ఆమె ప్రస్తుతం మైసూర్‌లోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఆ హంతకుడికి జగన్‌కి దగ్గరి పోలికలు ఉన్నాయి

- మొదటి పేజి తరువాయి

పోలికలు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు.

**ఒక వ్యక్తి దాహానికి లక్షల కోట్ల సంపద ఆవిరి**

గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. కడప స్టీల్ ప్లాంట్ పేరుతో ఒక వ్యక్తి అవినీతి దాహానికి లక్షల కోట్ల విలువైన సహజ సంపద ఆవిరైందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పేరుతో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బ్రహ్మణీ స్టీల్స్‌కు కేటాయించిన భూములను ప్రభుత్వం ఇప్పటికే వెనక్కి తీసుకుందని, అయితే ఓబులాపురం మైనింగ్ అంశం ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. జగన్, ఆయన కుటుంబం వల్ల ఎందరో ఐఏఎస్ అధికారులు బలయ్యారని, ఎంతోమంది వ్యాపారవేత్తలు సర్వనాశనమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా పెట్టుబడులు పెట్టేవారిని బెదిరించి, పరిశ్రమలను తరిమేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే భయంతోనే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని అన్నారు.

**హిట్, రన్ అండ్ ఎస్కేప్ వారి నైజం**

వైసీపీ నైజాన్ని చంద్రబాబు 'హిట్, రన్ అండ్ ఎస్కేప్'గా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏదో ఒక విధ్వంసం సృష్టించి, పక్క రాష్ట్రంలోని బెంగళూరులో తలదాచుకోవడం వారికి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని, నేతలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

సోషల్ మీడియాను వ్యక్తిత్వ హననాలకు, మహిళలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకుంటున్నారని, ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఫేక్ పోస్టులను కట్టడి చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు. సొంత ప్రయోజనాల కోసం రైతుల భూములను 22ఏ జాబితాలో పెట్టి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరిస్తోందని హామీ ఇచ్చారు.

**ఆ హంతకుడికి, జగన్‌కు దగ్గరి పోలికలు**

ఈ సందర్భంగా తెలంగాణలో జరిగిన ఓ దారుణ ఘటనను ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణలో ఓ వ్యక్తి తనపై పోక్సో కేసు పెట్టిందన్న కక్షతో బాధితురాలితో పాటు ఆమె కుటుంబాన్ని, తనకు సహకరించలేదని సొంత కుటుంబాన్ని కూడా కిరాతకంగా హత్య చేశాడు. అటువంటి సైకో మనస్తత్వానికీ, సొంత బాబాయిని చంపడం, కన్నతల్లి, చెల్లి విషయంలో జగన్ ప్రవర్తించిన తీరుకూ చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి" అని అన్నారు. వైసీపీ నేర ప్రవృత్తిని, దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాల్సిన బాధ్యత మీడియాపై ఉందని సూచించారు. భోగాపురం విమానాశ్రయం, పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులు పూర్తికావస్తుండటంతో గొడ్డలి పార్టీలో టెన్షన్ మొదలైందని చంద్రబాబు పేర్కొన్నారు.

## ధవళేశ్వరం మరింత పటిష్ఠం... కొత్తగేట్లు అమర్చే పనుల్ని ఈనెల 13న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ బృహత్ కార్యక్రమం ద్వారా బ్యారేజీని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ముందడుగు వేసింది.

బ్యారేజీ గేట్లను నిర్మించి 50 ఏళ్లు దాటడంతో వాటి సర్వీస్ లైఫ్ ముగిసిందని, వాటిని మార్చాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) గతంలోనే సిఫార్సు చేసింది. ఈ సూచనల మేరకు, ప్రస్తుత ప్రభుత్వం బ్యారేజీ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఆధునికీకరణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపింది. మొత్తం రూ.152.95 కోట్ల వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా, శిథిలావస్థకు చేరిన 117 ఫ్లడ్ గేట్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను బిగించనున్నారు. దీంతోపాటు, 12 హెడ్ స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు, 175 క్రెస్ట్ గేట్లకు కొత్త రబ్బరు సీల్స్, 734 రోలర్ బేరింగ్స్ అమర్చనున్నారు. బీఈసీఓఎమ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ పనులను దక్కించుకోగా, రెండేళ్లలో పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించనుంది. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం చూపిందన్న విమర్శలు ఉన్నాయి. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని, ధవళేశ్వరం బ్యారేజీ విషయంలోనూ కనీస మరమ్మతులు చేపట్టలేదని ఆరోపణలు వచ్చాయి. అయితే, 2014లో టీడీపీ ప్రభుత్వం రూ.31.77 కోట్లతో 58 గేట్లకు మరమ్మతులు చేయించింది. ఇప్పుడు పూర్తిస్థాయి ఆధునికీకరణకు నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఈ నెల 13న ఉదయం 10:25 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, 11:25 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నూతన గేట్ల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 11:45 గంటలకు ఆత్రేయాపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:20 గంటలకు పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. అక్కడ ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 5:20 గంటలకు పోలవరం పర్యటన ముగించుకుని తిరిగి అమరావతికి చేరుకుంటారు.

## బెంగాల్‌లో సౌరవ్ గంగూలీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం.. రూ.2,500 కోట్ల ప్రాజెక్టులో జాప్యం

- మొదటి పేజి తరువాయి

జిల్లాలోని గర్బేటాలో సుమారు రూ. 2,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. ప్రముఖ టీఎంటీ బార్ల తయారీ సంస్థ 'కెప్టెన్ స్టీల్' భాగస్వామ్యంతో గంగూలీ ఈ గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, ఏటా 8 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేసే సామర్థ్యం దీనికి ఉంటుంది. దీనివల్ల కెప్టెన్ స్టీల్ సంస్థ మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 13 లక్షల టన్నులకు చేరుకోనుంది. 2025 ఫిబ్రవరిలో ఈ ప్రాజెక్టు పురోగతిపై గంగూలీ మాట్లాడుతూ, "మేము స్టీల్ ప్లాంట్ నిర్మిస్తున్నాం. అయితే పనులు రెండు నెలల్లోనే పూర్తి కావాలని అందరూ ఆశిస్తారు, కానీ వాస్తవానికి అది సాధ్యం కాదు. దీనికి 18 నుంచి 20 నెలల సమయం పడుతుంది" అని పేర్కొన్నారు. అప్పటి నుంచి దాదాపు 17 నెలలు గడిచినప్పటికీ, ఉత్పత్తి ప్రారంభంపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. పర్యావరణ, కాలుష్య నియంత్రణ అనుమతులతో పాటు, 350 ఎకరాల భూసేకరణ వంటి ప్రక్రియల కారణంగానే ప్రాజెక్టులో కొంత ఆలస్యం జరుగుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

వాస్తవానికి ఈ ప్రాజెక్టును తొలుత సాల్బోనిలో ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ, తదనంతర పరిణామాల వల్ల గర్బేటాకు మార్చారు. ఈ ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే తొలి దశలో సుమారు 6,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. గంగూలీకి ఉక్కు రంగంలో 2007 నుంచే ప్రవేశం ఉంది. ఇప్పటికే ఆయనకు అసన్‌సోల్, పాట్నాల్లో ఉన్న చిన్న తరహా స్టీల్ ప్లాంట్లలో పెట్టుబడులు ఉన్నాయి.

# వియత్నాంలో ఘోర ప్రమాదం.. ఏపీ, తెలంగాణ వాసులతో వె ళుతున్న బోట్ మునక... 15 మంది మృతి

వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం.ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ న్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉద్ధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది.స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.ఒక మొబైల్ కంపెనీ తరపున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో ఆంధ్రప్రదేశ్?కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. మృతుల్లో మచిలీపట్నంకు చెందిన డిస్ట్రిబ్యూటర్ గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు. గిల్లి కిశోర్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం. కడపకు చెందిన నయీమ్ అనే డిస్ట్రిబ్యూటర్ ఆ బోటు ఎక్కకపోవడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొత్తం ఐదు బోట్లలో పర్యాటకులు విహారానికి వెళ్లగా, అందులో ఒక బోటు ప్రమాదానికి గురైంది.ఈ విషాద ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది.

ప్రమాదాన్ని ధ్రువీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన కార్యాలయం, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొంది. బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను (+84 36 281 7930, +84 91 552 37 14, +84 33 452 0414, +84 91 308 9165) కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

## "పల్లి పల్లి మినిస్టర్".. విజయవంతంగా ముగిసిన మంత్రి లోకేశ్ కొరియా పర్యటన

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ చేపట్టిన వారం రోజుల దక్షిణ కొరియా పర్యటన అద్భుతరీతిలో విజయవంతమైంది. భారత్-కొరియా మధ్య వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే క్రమంలో ఈ పర్యటన ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. దక్షిణ కొరియా విదేశాంగ శాఖ అధికారిక ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన ఈ పర్యటనలో మంత్రి లోకేశ్, ఆయన బృందం అక్కడి ప్రభుత్వ, పారిశ్రామిక వర్గాల నుంచి విశేష గౌరవాన్ని అందుకుంది.

**50కి పైగా కంపెనీలతో కీలక చర్చలు**

ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ 50కి పైగా కార్పొరేట్ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఎల్జీ, హ్యుందాయ్, శాంసంగ్, బీఎన్‌కే ఫైనాన్షియల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ముఖ్యంగా ఎల్జీ సంస్థ తమ ప్రధాన కార్యాలయానికి లోకేశ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి, ఉన్నత స్థాయి బృందంతో గౌరవ విందు ఇవ్వడం ఈ పర్యటనకు లభించిన ప్రాధాన్యతను చాటుతోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పారదర్శక పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై లోకేశ్ ఇచ్చిన ప్రజెంటేషన్‌కు కొరియన్ కంపెనీల నుంచి అద్భుత స్పందన లభించింది. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ ఉన్నత యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయా సంస్థలు హామీ ఇచ్చాయి.

**బుసాన్‌లో 'అపెక్స్-కొరియా' సెల్ ప్రారంభం**

పెట్టుబడిదారులకు మరింత చేరువయ్యేందుకు, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కొరియాలోని ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో మంత్రి లోకేశ్ 'అపెక్స్-కొరియా' (ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్-కొరియా) కేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఈడీబీ ఆధ్వర్యంలో పనిచేసే ఈ ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునే కొరియన్ కంపెనీలకు ఒక వారధిగా పనిచేస్తుంది. ఇప్పటికే శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో 40కి పైగా కొరియన్ కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తుండగా, ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో మరిన్ని కంపెనీలు రాష్ట్రానికి వచ్చేందుకు మార్గం సుగమమైంది. పర్యటన ప్రారంభంలో సియోల్‌లోని భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో భేటీ అయిన లోకేశ్, కొరియాలోని కీలక పరిశ్రమలను ఏపీకి తీసుకురావడంలో చొరవ చూపాలని కోరారు.

**'పల్లి పల్లి' మినిస్టర్ అంటూ ప్రశంసలు**

ఆంధ్రప్రదేశ్‌లో 'కియా' మోటార్స్ కేవలం రెండేళ్లలో సాధించిన అసాధారణ విజయాన్ని లోకేశ్ తన ప్రసంగాల్లో ఉదహరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న '3ఎస్' మోడల్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమతుల విధానం కొరియన్లను అమితంగా ఆకట్టుకుంది. మంత్రి లోకేశ్ పని వేగాన్ని, చొరవను చూసి ముగ్ధులైన కొరియన్ ప్రతినిధులు ఆయన్ను 'పల్లి.. పల్లి మంత్రి' అని ముద్దుగా పిలుచుకున్నారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి' అంటే 'త్వరగా త్వరగా' అని అర్థం.

లోకేశ్ బృందం పర్యటన అద్భుతమని కొరియా వాణిజ్య ప్రోత్సాహక సంస్థ (కోట్రా) దక్షిణాసియా విభాగాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్ ఎక్స్ వేదికగా ప్రశంసించారు.

## హెలికాప్టర్ ఆపితే.. రైల్లో వస్తారు

ఆక్వా రైతుల సమస్యలపై వైసీపీ అధినేత జగన్ చేపట్టబోయే భీమవరం పర్యటనను కూటమి ప్రభుత్వం ఏ రకంగానూ అడ్డుకోలేదని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. ఒకవేళ హెలిప్యాడ్‌కు పర్మిషన్ ఇవ్వకపోతే.. జగన్ రైలు ఎక్కైనా సరే భీమవరం వచ్చి రైతులను కలుస్తారని తేల్చిచెప్పారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలోని బువ్వనపల్లిలో ఈరోజు జరిగిన ఆక్వా రైతుల ఆత్మీయ సమావేశంలో పేర్ని నాని పాల్గొని మాట్లాడారు.న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో ఆక్వా రైతాంగం తీవ్రమైన కష్టాల్లో ఉన్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్ని నాని మండిపడ్డారు. ఆక్వా మేత ధరలు ఆకాశాన్నంటుతున్నా వాటిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. మేత కంపెనీల యాజమాన్యాలు, పాలకులు చేతులు కలపడం వల్లే పెట్టుబడి వ్యయం పెరిగిపోయి రైతులు భారీ నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆరోపించారు.

ఆక్వా రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు జులై 15వ తేదీన జగన్ భీమవరం రావడం ఖాయమైందని పేర్ని నాని వెల్లడించారు. ఈ పర్యటనను ఫ్లాప్ చేయడానికి లేదా అడ్డుకోవడానికి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, కుతంత్రాలు చేసినా జగన్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు.

"కూటమి ప్రభుత్వం హెలిప్యాడ్‌కు అనుమతులు నిరాకరిస్తే నిరాకరించుకోవచ్చు. జగన్ అవసరమైతే సామాన్యుడిలా రైల్లో ప్రయాణించి అయినా సరే ఇక్కడికి చేరుకుంటారు. రైతులను కలిసి వారి సమస్యలపై ప్రభుత్వం దిగివచ్చేలా పోరాడుతారు" అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, లేదంటే ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## సీఎం రేవంత్ ను కలిసిన ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్

ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ వైమానిక సంస్థ 25వ వార్షికోత్సవాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూబ్లీహిల్స్‌లో ఈ భేటీ జరిగింది. తెలంగాణలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణం జరగబోతోందని... రాష్ట్రానికి ఎమిరేట్స్ విమాన సర్వీసులను మరింత పెంచాలని ఈ సందర్భంగా సార్థన్ ను రేవంత్ రెడ్డి కోరారు. దీంతో, హైదరాబాద్‌కు ఏ-380 విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఎమిరేట్స్ సంస్థ ఆసక్తి చూపించింది.

ఎమిరేట్స్‌కు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అంతేకాకుండా గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పాన్సర్‌షిప్ అందించాలని రేవంత్ రెడ్డి కోరగా, ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు. త్వరలో తెలంగాణలో వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కొత్త విమానాశ్రయాలను నిర్మించబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విమాన సర్వీసులు పెంచాలని ఎమిరేట్స్ ను రేవంత్ కోరారు.

## 40 ఏళ్ల నిరీక్షణకు తగిన ఫలం.. మోదీ రాక చరిత్రాత్మకం

న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. 40 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత ప్రధాని తమ దేశంలో అడుగుపెట్టడం ఒక చరిత్రాత్మక ఘట్టమని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ అభివర్ణించారు. ప్రధాని మోదీ రాక కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నామని, ఈ నిరీక్షణకు తగిన ఫలం దక్కిందని ఆయన అన్నారు.ఆక్లాండ్‌లో ప్రవాస భారతీయులు నిర్వహించిన 'కియా ఓరా మోదీ' కార్యక్రమంలో లక్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ రోజు న్యూజిలాండ్ చరిత్ర సృష్టిస్తోంది. 40 ఏళ్ల తర్వాత భారత ప్రధాని న్యూజిలాండ్ గడ్డపై నిలబడ్డారు. ఇది కుటుంబ సభ్యుల మధ్య చాలా సుదీర్ఘ విరామం. కానీ ప్రధాని మోదీ, ఐదు మిలియన్ల న్యూజిలాండ్ ప్రజల తరపున చెబుతున్నా.. మీ రాక మా నిరీక్షణకు తగినది" అని వ్యాఖ్యానించారు. 10,000 మందికి పైగా ప్రవాస భారతీయులతో కిక్కిరిసిన ఆడిటోరియంను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని ఎంతో మంది పెద్ద స్టార్లు ప్రదర్శనలిచ్చిన ఈ వేదికపై ఇంతటి ఉత్సాహభరిత వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ సాధించిన అద్భుత పరివర్తన తనను నివ్వెరపరిచిందని లక్సన్ కొనియాడారు. "గత దశాబ్ద కాలంలోనే మోదీ నాయకత్వంలో 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారు. ఇది ప్రపంచంలోనే మానవ గౌరవాన్ని నిలబెట్టిన గొప్ప విజయాలలో ఒకటి. నేడు ప్రపంచంలోనే అతిపెద్ద మధ్యతరగతి వర్గాల్లో ఒకటైన 445 మిలియన్ల మంది భారత్‌లో ఉన్నారు. వారి ఆదాయాలు పెరిగి, ఉత్తమ జీవన ప్రమాణాలు అందుకుంటున్నారు" అని వివరించారు.భారత్ సాధించిన అభివృద్ధిని లక్సన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "మోదీ హయాంలో విమానాశ్రయాల సంఖ్య రెట్టింపై 157కి చేరింది. సుమారు 95,000 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారులు నిర్మించారు. అంతరిక్ష రంగంలోనూ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా ల్యాండర్?ను దించిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది" అని గుర్తుచేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ పాత్రను నొక్కిచెప్పిన లక్సన్, త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని అన్నారు. "21వ శతాబ్దం భారత్‌దే. ఈ భవిష్యత్ నిర్మాణంలో భారత్‌తో కలిసి పయనించాలని న్యూజిలాండ్ కోరుకుంటోంది" అని ఆయన స్పష్టం చేశారు.

## మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం చేశారు. టెలిగ్రామ్ ద్వారా విడుదల చేసిన సందేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తండ్రి మృతికి కారకులైన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మొజ్తబా హెచ్చరించారు. ఇది దేశ ప్రజల డిమాండ్ అని, తన నాయకుడితో పాటు అమరులైన వారి తరఫున హంతకులపై ప్రతీకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఇదే దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా.. జులై 9న జరిగిన తన తండ్రి అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయారు. తనను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో మొజ్తబా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు

- మొదటి పేజి తరువాయి

ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.

ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయనిస్పష్టం చేశారు.

## లెజెండరీ సింగర్ ఎస్. జానకి కన్నుమూత

- మొదటి పేజి తరువాయి

చికిత్స పొందుతున్నారు. శనివారం (జులై 11) ఆరోగ్యం విషమించడంతో ఆమె తుదిశ్వాస విడిచారు. జానకి మనువరాలు అప్సర వైద్యుల ఇన్స్?స్టా?గ్రామ్ వేదికగా ఈ విషయాన్ని ధృవీకరించారు. దీంతో భారతీయ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. తన అద్భుతమైన స్వరంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న గాన కోకిల జానకి మరణంపై పలువురు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు.

**ఎస్. జానకి బ్యాగ్రౌండ్:**

తన మధురమైన గాత్రంతో ఆరు దశాబ్దాల పాటు కోట్ల మంది శ్రోతలను మైమరపించిన గానకోకిల, దక్షిణ భారత నైటింగేల్ ఎస్. జానకి 1938, ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించారు. ఏ విధమైన శాస్త్రీయ సంగీతం నేర్చుకోకుండానే తన అద్భుత స్వరంతో ఆరు దశాబ్దాల పాటు సంగీత పరిశ్రమను ఏలారు. 1957లో తమిళ చిత్రం ద్వారా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె.. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీతో పాటు దాదాపు 17 భాషల్లో 48 వేలకు పైగా పాటలు పాడి సరికొత్త రికార్డు సృష్టించారు. తన అద్భుతమైన స్వరంతో 4 జాతీయ అవార్డులు, 32 వేర్వేరు రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు సాధించారు. చిన్న పిల్లల గొంతు నుంచి పండు ముసలి వారి వరకు.. ఎలాంటి పాత్రకైనా తన గొంతుతో ప్రాణం పోయడం ఆమె స్పెషాలిటీ. జానకి భౌతికంగా మన మధ్య లేకపోయినా... ఆమె పాడిన వేలాది పాటలు, ఆ మధుర స్వరం సంగీత ప్రియుల గుండెల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

## ఏఐ వచ్చినా.. యుద్ధంలో గెలిచేది సైనికులే

- మొదటి పేజి తరువాయి

అంతిమంగా విజయాన్ని నిర్ణయించేది సంప్రదాయ సైనిక సామర్థ్యాలు, శిక్షణ పొందిన సైనికులు, దేశ సంకల్పమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. నేడు విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' యుద్ధనౌకను నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవిష్యత్ యుద్ధాలు ఏఐతో జరగవచ్చేమో గానీ, వాటిని గెలిచేది మాత్రం మన సైనికులు, విశ్వసనీయ సైనిక బలంతోనేనని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "నూతన సాంకేతికతలు యుద్ధ స్వభావాన్ని మార్చిన మాట వాస్తవమే. కానీ, సంప్రదాయ యుద్ధ సామర్థ్యాల ప్రాధాన్యతను అవి ఏమాత్రం తగ్గించలేదు. యుద్ధం ప్రాథమిక సూత్రాలను నెరవేర్చడానికి బలమైన సంప్రదాయ సామర్థ్యాలు నేటికీ ఎంతో అవసరం. కేవలం కొత్త టెక్నాలజీపై ఆకర్షణతో సంప్రదాయ సైనిక శక్తిని నిర్లక్ష్యం చేసిన దేశాలు భారీ మూల్యం చెల్లించుకున్నాయని చరిత్ర మనకు గుర్తుచేస్తోంది" అని వివరించారు.

నూతన టెక్నాలజీ, సంప్రదాయ వేదికలు ఒకదానికొకటి పోటీ కాదని, అవి పరస్పర పూరకాలు అని రక్షణ మంత్రి తెలిపారు. "ఒక సంప్రదాయ వేదిక కొత్త టెక్నాలజీ లేకుండా బలహీనపడుతుంది, అదే సమయంలో టెక్నాలజీకి ఒక వేదిక అవసరం. అందుకే, రెండు రంగాల్లోనూ రాణిస్తూ, వాటి మధ్య సమతుల్యం పాటించాలనేది భారత విధానం. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతూనే, మన సంప్రదాయ సామర్థ్యాలను నిరంతరం పదునుపెట్టుకుంటాం. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఈ సంకల్పానికి, నిబద్ధతకు ప్రతీక" అని ఆయన అన్నారు.ఇటీవల కాలంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' వంటి సైనిక చర్యలు.. సంప్రదాయ, ఆధునిక సామర్థ్యాలను సమర్థవంతంగా మేళవించగల భారత శక్తిని నిరూపించాయని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. ఆత్మరక్షణకే కాకుండా అవసరమైనప్పుడు శత్రువుపై నిర్ణయాత్మకమైన దెబ్బకొట్టి, వారిని పూర్తిగా నిర్మూలించగల సత్తా భారత్‌కు ఉందని ఈ ఆపరేషన్ రుజువు చేసిందని పేర్కొన్నారు.యుద్ధనౌకల నిర్మాణం కేవలం నౌకాదళాన్ని బలోపేతం చేయడమే కాదని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తినిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఒక యుద్ధనౌక నిర్మాణం అంటే ఒక పరిశ్రమల వ్యవస్థను నిర్మించడమే. ఉక్కు, ఎలక్ట్రానిక్స్, సెన్సార్లు, ప్రొపల్షన్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్, లాజిస్టిక్స్ వంటి ఎన్నో రంగాలను ఇది ముందుకు నడిపిస్తుంది. దీనివల్ల లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది, కొత్త టెక్నాలజీలు అభివృద్ధి చెందుతాయి, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుంది" అని తెలిపారు.భారత్‌ను నౌకా నిర్మాణ రంగంలో గ్లోబల్ హబ్‌గా నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనికోసం 'మారిటైమ్ ఇండియా విజన్ 2030'పై వేగంగా పనిచేస్తున్నామని చెప్పారు. మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్, షిప్‌బిల్డింగ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్ వంటి పథకాల ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# పసుమర్తి వద్ద రోడ్డు ప్రమాదం

## కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 11 :** పసుమర్తి వద్ద శనివారం ఉదయం తీవ్ర రోడ్డు ప్రమాదం జరిగింది.హైదరాబాద్ నుంచి వస్తున్న కారును ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది.ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జు నుజ్జయింది. హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో వస్తున్న కారు,పసుమర్తి వద్దకు రాగానే ప్రమాదం బారిన పడింది.ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి కారును బలంగా ఢీకొట్టడంతో, కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగాఉలిక్కిపడ్డారు.




**క్షేమంగా బయటపడిన ప్రయాణికులు :**

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై, కారులో చిక్కుకున్న నలుగురు ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు.వెంటనే వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.వైద్యుల సమాచారం మేరకు, బాధితులకు స్వల్ప గాయాలయ్యాయని, వారిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని తెలుస్తోంది.

**పోలీసుల దర్యాప్తు :**

సమాచారం అందుకున్న చిలకలూరిపేట పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురైన కారును రోడ్డు పక్కకు తొలగించి ,ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ప్రమాదానికి అతివేగం కారణమా లేక డ్రైవర్ నిర్లక్ష్యమా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం - భర్త అరెస్ట్

**చీరాల, పెన్ పవర్, జూలై 11:** కుటుంబ కలహాలు, భార్యపై అనుమానాల నేపథ్యంలో భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించిన భర్తను పోలీసులు అరెస్టు చేసినట్లు బాపట్ల జిల్లా చీరాల డీఎస్పీ మహమ్మద్ మోయిన్ వెల్లడించారు. శనివారం చీరాల డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని నవజ్యోతి కాలనీలోని కప్పలదొడ్డికి చెందిన అన్నపురెడ్డి వీరమ్మ అలియాస్ షేక్ ఆశ (39)ను ఆమె భర్త షేక్ రఫీ ఈ నెల 9వ తేదీ తెల్లవారుజామున సుమారు 4.30 గంటల సమయంలో సెల్‌ఫోన్ ఛార్జింగ్ కేబుల్‌తో మెడ బిగించి హత్య చేసినట్లు తెలిపారు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న కుటుంబ కలహాలు, భార్యపై పెంచుకున్న అనుమానాలే ఈ హత్యకు కారణమైనట్లు దర్యాప్తులో తేలిందని డీఎస్పీ పేర్కొన్నారు. హత్య అనంతరం ఘటనను ఆత్మహత్యగా నమ్మించేలా నిందితుడు ప్రయత్నించినప్పటికీ, పోలీసుల లోతైన విచారణలో అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. సమాచారం అందుకున్న వెంటనే చీరాల రూరల్ సీఐ సుధాకర్, వేటపాలెం ఎస్సై జనార్ధన్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ వివరాలు, విచారణలో లభించిన సమాచారంతో నిందితుడు షేక్ రఫీని అదుపులోకి తీసుకుని విచారించగా, తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని శనివారం మీడియా ముందు హాజరుపరిచి అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులను డీఎస్పీ అభినందించారు.




# పేరాల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ్ కిట్ల పంపిణీ

**చీరాల, పెన్ పవర్, జూలై 11:** చీరాల మండల పరిధిలోని పేరాల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్ సి)లో శనివారం గర్భిణీలు, బాలింతలకు ఉచిత 'పోషణ్ కిట్ల' పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల పార్లమెంట్ సభ్యులు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ చొరవతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. ఈ కిట్లు తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని వైద్య అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉచితంగా పోషకాహార కిట్లు అందిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని గర్భిణీలు, బాలింతలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు.



గెయిల్ (ఇండియా) లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి యస్ ఆర్) నిధుల సహకారంతో, అవంత్ ఫౌండేషన్ మరియు కృష్ణప్రసాద్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ బృహత్తర పోషణ్ కిట్ల పంపిణీ కార్యక్రమం బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వాహనం అదుపుతప్పి గోతిలో పడి యువకుడు మృతి

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 11 :** నాదెండ్ల : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో గోతిలో పడి నుదురుపాడుకు చెందిన కేరళలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్న అనిల్ కుమార్ (27) దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాదెండ్ల లో తమ బంధువులు మృతి చెందడంతో ద్విచక్ర వాహనంపై నాదెండ్ల-అప్పాపురం మధ్య డొంక రోడ్ లో వాహనం అదుపుతప్పి గోతిలో పడ్డాడు. 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .మెరుగైన చికిత్స కోసం గుంటూరు జిజిహెచ్ తరలించగా మృతి చెందాడు. ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.




పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# క్షేత్రస్థాయిలో ఓటర్ల సేవలో అధికార యంత్రాంగం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, జూలై, 11 :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2026 కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఈ నెల 14వ తేదీతో గడువు ముగియనున్నందున, ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు తమ ఫారాన్ని బీఎల్‌వోకు తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఫారం సమర్పణలో ఎలాంటి ఇబ్బంది ఉన్నా సహాయసహకారాలు అందించేందుకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలో పర్యటించి సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటైజేషన్ పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారంతో పాటు ఆదివారం కూడా సర్ ప్రత్యేక శిబిరాలు అందుబాటులో ఉంటాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు ఫారాల సమర్పణలో సందేహాల నివృత్తి కోసం అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉన్నారని చెప్పారు. ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వామి కావడం ద్వారా ఓటర్ల జాబితా మరింత కచ్చితత్వంతో, దోష రహితంగా రూపొందించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించి ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.




**కీలక మైలురాయిని దాటిన సర్ (82.15 శాతం డిజిటైజేషన్)**

జిల్లాలో సర్ ప్రక్రియ విజయం గమ్యానికి చేరడంలో కీలకమైలురాయిని చేరుకుంది. 14,07,640 (82.15 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయింది. తిరువూరు నియోజకవర్గంలో 1,84,365 (88.34 శాతం), విజయవాడ పశ్చిమ 1,98,187 (77.12 శాతం), విజయవాడ మధ్య 2,17,887 (78.43 శాతం), విజయవాడ తూర్పు 2,14,234 (79.42 శాతం), మైలవరం 2,40,411 (84.31 శాతం), నందిగామ 1,75,955 (84.81 శాతం), జగ్గయ్యపేట 1,76,601 (85.09 శాతం) ఫారాల డిజిటైజేషన్ పూర్తయింది.

# ఫార్చ్యూన్ ఇండియా 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్' అవార్డు అందుకున్న నారా బ్రాహ్మణికి ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య అభినందనలు

**చీరాల, పెన్ పవర్, జూలై 11:** ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన "100 మంది అత్యంత ప్రభావవంతమైన మహిళలు" జాబితాలో చోటు దక్కించుకుని ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్న నారా బ్రాహ్మణి గారికి చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నారావారి కోడలు, రాష్ట్ర యువ నాయకులు నారా లోకేష్ వారి సతీమణి అయిన నారా బ్రాహ్మణి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం యావత్ మహిళాలోకానికి గర్వకారణమని అన్నారు. సంపూర్ణ మహిళా సాధికారితకు నిలువెత్తు రూపంగా నిలుస్తున్న ఆమె నాయకత్వం, సమర్థత, వ్యాపార దక్షత, సేవా దృక్పథం దేశవ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వ్యాపార రంగంలో అత్యున్నత ప్రమాణాలతో పాటు సామాజిక బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తూ మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని నారా బ్రాహ్మణి నిరూపించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆమె సాధించిన ఈ గౌరవం తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ ఆనందాన్ని కలిగించేదని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.



# చిరుధాన్యాలు.. ఆరోగ్యం, ఆదాయానికీ బలం : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, పెన్ పవర్, జులై, 11 :** ఆధునిక జీవనశైలి నేపథ్యంలో సమతుల్య పోషకాహారానికి చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయని.. పీచుపదార్థం, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజలవణాలు సమృద్ధిగా ఉండే చిరుధాన్యాలు ఆరోగ్యకర జీవితానికి పునాదులు వేస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఈ నేపథ్యంలో చిరుధాన్యాల విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో మిల్లెట్ ఫుడ్ ప్రొడక్ట్స్‌పై వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 80 మంది స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొనగా 9నట్జ్ మిల్లెట్స్ పీవీట్ . లీడ్ .) సీఈవో వి.కీర్తన చిరుధాన్యాలతో తయారయ్యే విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. మెరుగైన ఉపాధి అవకాశాలకు ఇవి ఏవిధంగా సహాయపడుతున్నాయో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నేటి జీవనశైలికి చిరుధాన్యాలే ఆరోగ్యానికి, ఆనందానికి, ఆర్థికాభివృద్ధికి చిరునామా అని నిపుణులు సూచిస్తున్న వేళ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఇటు ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అటు అత్యుత్తమ ఉపాధికి బాటలు వేసుకోవాలని సూచించారు. రైజ్ కేంద్రంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లు, శిక్షణ కార్యక్రమాల ద్వారా అనేక మంది మహిళలు ఇప్పటికే పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేశారని.. వీరిని స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవం దళితవాదం పేరుతో హిందూ ధర్మంపై కూటమి ప్రభుత్వంపై కుట్ర జరుగుతుంది దర్శనపు శ్రీనివాస్.



**గుంటూరు, పెన్ పవర్, జూలై 11 :** అరండల్ పేట మూడో లైన్ యోగిభవన్లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ దళిత క్రైస్తవుల అంశంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. అసలు ఎస్సీ రిజర్వేషన్లు ఎందుకు ఇచ్చారు అనేదానిపై మీడియాకు తెలిపారు. సమాజంలో అంటరానితనానికి గురై వెలి వేతకు వెనుకబాటుతనానికి గురైన వారికి షెడ్యూలు కులాలు వారిగా గుర్తించి వారి యొక్క అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరచడం జరిగినది. కానీ గత పాలకులు మతం పేరుతో కులం పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలుగా చేసి.. నిజమైన హిందూ దళితులకు కాకుండా.. మతం మారిన దళిత వర్గాలకు అడ్డదారిలో ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చి.. వారికి కూడా ఎస్సీ రిజర్వేషన్లు ఫలాలు అందే విధంగా కుట్ర చేశారు.. దీనిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది అని.. ఇకనుండి భవిష్యత్తులో బలవంత మతమార్పిడిలను అడ్డుకుంటామని.. మతం మారిన దళితులకు కచ్చితంగా ఎస్సీ రిజర్వేషన్లు అందకుండా చట్టపరంగా పోరాడుతామని దర్శనపు శ్రీనివాస్ మీడియాకు తెలిపారు.గత రెండు నెలలుగా ఆంధ్రప్రదేశ్లో స్వయం ప్రకటిత సంఘాల పేరుతో కొందరు ఐఏఎస్ ఐపీఎస్ మరికొందరు సివిల్ జడ్జి.. మరి కొంతమంది రూపాంతరం చెందిన ఆంగ్లేయులు.. వీరంతా మతం మారి.. దళితవాదం ముసుకు అంబేద్కర్ ముసుగుతో.. ప్రతినిత్యం తెలుగు రాష్ట్రాలలో.. సభలు సమావేశాలు పెట్టి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించటానికి.. కుట్ర చేస్తున్నారని వీరిని తక్షణం ప్రభుత్వం అరెస్టు చేయాలని దర్శనపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలో 26 27 28 అధికరణలకు లోబడి.. ఏ మతం వారైనా మసులుకోవాలని.. అదేవిధంగా ఆర్టికల్ 30 ప్రకారం మతం మారిన వారికి మైనారిటీ సంక్షేమం పేరుతో ప్రభుత్వం అనేకమైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని.. అలాంటి మైనారిటీ శాఖలో మతం మారిన దళితులు వాటాన్ని పొందచ్చని అంతేగాని నిజమైన హిందూ దళితుల కోసం ఏర్పాటు చేయబడిన దళిత రిజర్వేషన్లు.. మతం మారిన వారికి వర్తించవని... దర్శనపు శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. మతం మారితే కులం పోదు అని అసత్య ఆరోపణలు చేస్తున్న జడ శ్రావణ్ పివి సునీల్ కుమార్ విజయ్ కుమార్ హర్ష కుమార్ లాంటి క్రైస్తవ మత భావజాలాన్ని.. దళిత వర్గాలు నమ్మొద్దు వారి మాటలు వింటే నష్టపోతారని. వీరంతా జగన్మోహన్ రెడ్డికి బీ టీం గా పనిచేస్తున్నారని.. దర్శనపు శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై దళితవాదం ముసుకుతో జగన్ అద్దె మైకు గా వీలు మాట్లాడుతున్నారని... వీళ్లంతా ఉద్యోగ సర్విస్ లో ఉన్నప్పుడు ఏ దళితుడికి సహాయం చేయని.. దుర్మార్గులని దర్శనపు శ్రీనివాస్ ఎద్దేవ చేశారు అదేవిధంగా హిందూ దేవీ దేవతలను ప్రశ్న రావణ్ అనేటోడు.. అలియాస్ పచ్చలకూర జోసెఫ్.. సీతారాముల వారిపై హిందూ ధర్మంపై విపరీతమైన అసభ్య పదజాలంతో మాట్లాడటం వీడి పైన ప్రభుత్వ స్పందించి ఉప..చట్టాన్ని ప్రయోగించడం మంచి పరిణామం అని.. ఈ శ్రావణ్ అనేటోడి ఎదవకు.. సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలని.. సీతారాముల వారిని ఈ దేశంలో ప్రతి ఒక్కరు కూడా తమ తల్లిదండ్రులుగా భావిస్తారని అలాంటి వారిని అసభ్య పదజాలంతో మాట్లాడిన వాడిని వదిలివేయాల.. వాడికి అనుకూలంగా మాట్లాడే ప్రతి ఒక్కరిని కూడా ప్రభుత్వం వదిలిపెట్టొద్దని.. దర్శనపు శ్రీనివాస్ తెలిపారు భవిష్యత్తులో హిందూ ధర్మంపై ఎవరు మాట్లాడిన భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అదేవిధంగా ఈ మీడియా సమావేశంలో పాల్గొన్న బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ.. దళిత క్రైస్తవం పేరుతో రాష్ట్రంలో ఏదో ఒక అల్లర్లకు కుట్ర జరుగుతుందని.. దీనిని ప్రజలందరూ సమర్థవంతంగా ఎదుర్కోవాలని... ముఖ్యంగా దేశంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి కార్యక్రమాలు చేపడుతుంటే అది జీర్ణించుకోలేక.. కమ్యూనిస్టులు కాంగ్రెస్ వారు అదే విధంగా ఆంధ్రప్రదేశ్లో జగన్మోహన్ రెడ్డి.. ఏదో ఒక అలజడి ప్రజల్లో సృష్టించాలని.. ప్రయత్నాల్లో ఉన్నారు వీరిని అడ్డుకుంటామని తిరుపతి రావు మీడియాకు తెలిపారు ఈ మీడియా సమావేశంలో.. రాష్ట్ర మీడియా ప్లాన్ లిస్ట్.. తాడువాయి రామకృష్ణ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ . ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ధారా అంబేద్కర్ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు.. కంతేటి బ్రహ్మయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ ఈ మీడియా సమావేశంలో పాల్గొన్నారు

## దేశాయిపేటలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం సమీక్ష



**వేటపాలెం, పెన్ పవర్, జూలై 11:** చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య సూచనల మేరకు వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని స్థానిక నాయకులు సమీక్షించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ) చేపడుతున్న ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని బీఎల్ఓ లకు తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాచక వీరభద్రయ్య, మండల పార్టీ అధ్యక్షులు గుత్తి సీతారామాంజనేయులు, తెలుగు రైతు మండల అధ్యక్షులు పోలకం చంద్రశేఖర్, పాపాయిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకటనారాయణ, దేశాయిపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు మాచర్ల సాంబశివరావు, క్లస్టర్ ఇన్చార్జి పేరిసెట్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## భట్టిప్రోలులో భారీ అగ్నిప్రమాదం

**భట్టిప్రోలు,పెన్ పవర్, జూలై 11 :** భట్టిప్రోలు నుంచి రేపల్లెకు వెళ్లే మార్గంలో విద్యుత్తు ఉప కేంద్రం పక్కనే ఉన్న షేక్ సత్తార్ పాత ఇనుప దుకాణంలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇందులో పాత ప్లాస్టిక్, రబ్బర్లు, డబ్బాలు వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకొని మంటలు ఎగసిపడ్డాయి. ప్లాస్టిక్ వస్తువులు కావడంతో దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా వ్యాప్తించింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి వచ్చి సుమారు ఎనిమిది గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఆ పక్కనే విద్యుత్తు ఉప కేంద్రం, పెట్రోలు బంకు ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మంటలు ఎగసి పడుతున్నప్పటి నుంచి వాహనాలకు పెట్రోల్ కొట్టడం నిలుపుదల చేశారు. విద్యుత్తు సరఫరాను నిలిపేసి మంటలను ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు నాగరాజు, ఎస్సై అమీర్ ఆ ప్రాంతంలో ఉండి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మూడు గంటలకుపైగా భట్టిప్రోలు- రేపల్లె మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాదం ఏవిధంగా జరిగిందో తేల్చాల్సి ఉంది. ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు భావిస్తున్నారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన 1995-96 టెన్త్ క్లాస్ బ్యాచ్



**వేటపాలెం, పెన్ పవర్, జులై 11:** స్నేహం అంటే కష్టసమయంలో అండగా నిలవడమేనని 1995-96 టెన్త్ క్లాస్ బ్యాచ్ సభ్యులు మరోసారి నిరూపించారు. వేటపాలెం మండలం, దేశాయిపేట పంచాయతీ, రామానగర్కు చెందిన పసుమర్తి వెంకట సుబ్బారావు అమరావతి సచివాలయంలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో విదేశాల్లో నివసిస్తున్న ఎన్నారై, అదే బ్యాచ్కు చెందిన పింజల విజయ్ కుమార్ తన స్నేహితుడి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు. కుటుంబ అవసరాల నిమిత్తం పసుమర్తి వెంకట సుబ్బారావు భార్య శివకుమారికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పింజల విజయ్ కుమార్ మాట్లాడుతూ, "నా స్నేహితుడు పసుమర్తి వెంకట సుబ్బారావు అకాల మరణం ఎంతో బాధ కలిగించింది. ఆయన కుటుంబానికి నా వంతు సహాయం అందించడం నా బాధ్యతగా భావించాను. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అందరూ తోడుగా నిలవాలి" అని అన్నారు. ఆర్థిక సహాయం అందుకున్న శివకుమారి మాట్లాడుతూ, తమ కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో అండగా నిలిచిన పింజల విజయ్ కుమార్తో పాటు 1995-96 టెన్త్ క్లాస్ బ్యాచ్ స్నేహితులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ జిలాని, ముంగర పూర్ణ, ఆలీ, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు. స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న 1995-96 టెన్త్ క్లాస్ బ్యాచ్ సభ్యులను స్థానికులు అభినందించారు.

## మద్యం మత్తులో డ్రైవర్ వీరంగం

### ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 11 :** పట్టణంలోని కొండ్రుపాడు సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పీకలదాకా మద్యం సేవించిన ఓ గూడ్స్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్ పై వెళ్తున్న వ్యక్తి కాలు నుజ్జునుజ్జయి పరిస్థితి మారింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మార్కాపురంలో లోడ్ దించి తిరిగి విజయవాడ వెళ్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనం నరసరావుపేట మీదుగా చిలకలూరిపేట వైపు వస్తోంది. అదే సమయంలో చిలకలూరిపేట నుండి కొండపాడు వెళ్తున్న 'నాగూర్' అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని ఆ గూడ్స్ బండి డ్రైవర్ ముందు నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగూర్ కాలు మూడు ముక్కలుగా విరిగిపోయి తీవ్ర రక్తస్రావం జరిగింది. వెంటనే బాధితుడిని చిలకలూరిపేటలోని ఆర్కే ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన గుంటూరు ఆసుపత్రికి తరలించారు.

## పోగొట్టుకున్న మొబైల్ను గుర్తించి బాధితురాలికి అప్పగించిన కారంచేడు పోలీసులు




**కారంచేడు (బాపట్ల జిల్లా) పెన్ పవర్, జులై 11:** సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ను గుర్తించి బాధితురాలికి అప్పగించడం ద్వారా కారంచేడు పోలీసులు తమ సేవా దృక్పథాన్ని మరోసారి చాటిచెప్పారు. బాపట్ల జిల్లా, కారంచేడు మండలం, పోతినవారిపాలెం గ్రామానికి చెందిన పేరిన చంద్రిక (భర్త: మస్తానయ్య) తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న నేపథ్యంలో ఈ నెల 3న కారంచేడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలను వినియోగించి మొబైల్ ఫోన్ ఆచూకీ కోసం ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు కారంచేడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్ కె. ఖాదర్ భాషా ఆధ్వర్యంలో చేపట్టిన చర్యల ఫలితంగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ను విజయవంతంగా గుర్తించారు. అనంతరం శనివారం బాధితురాలు పేరిన చంద్రికకు ఆ మొబైల్ ఫోన్ను అప్పగించారు. తనకు ఎంతో విలువైన మొబైల్ ఫోన్ తిరిగి లభించడంతో బాధితురాలు ఆనందం వ్యక్తం చేస్తూ, వేగంగా స్పందించి సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ను గుర్తించి అందించిన కారంచేడు పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, ప్రజలు తమ మొబైల్ ఫోన్లు లేదా ఇతర విలువైన వస్తువులు పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వాటిని గుర్తించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.

## ఎంపి భాష్యం రామకృష్ణను అభినందించిన జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కమిటి సభ్యులు






**గుంటూరు, పెన్ పవర్, జూలై, 11 :** నేటినుండి స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం కానున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సంపత్ కుమార్ తెలిపారు,ఉమ్మడి జిల్లా నుండి 400 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతారని చెప్పారు,అండర్ 11 నుండి అన్ని ఏజ్ గ్రూప్ క్రీడాకారులకు పోటీలు జరుగుతాయని అన్నారు,గెలుపొందిన వారిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామని అన్నారు,పోటీలకు కావలసిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు,ముఖ్య అతిథిగా రాజ్య సభ సభ్యులు హాజరవుతారన్నారు,కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు,వారితో పాటు సభ్యులు రమేష్,సతీష్,రాము,వెంకటేశ్వరావు ,హరి తదితరులు పాల్గొన్నారు

## 28న ఢిల్లీలో తెలుగు వెలుగు సంబరాలు

**లబ్బీపేట(విజయవాడతూర్పు) పెన్ పవర్, జులై 11:** దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెల 28వ తేదీ తెలుగు వెలుగు సంబరాలు పేరిట సాంస్కృతిక పండుగను నిర్వహించనున్నట్లు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేసీ రాజు రాంప్రసాద్ తెలిపారు. న్యూఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాలైన హరియాణ, పంజాబ్లలో నివసిస్తున్న తెలుగువారి కోసం సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో జరిగిన మీడియా సమావేశంలో తెలుగు వెలుగు సంబరాల పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేసీ రాజు రాంప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి, ప్రవాస తెలుగు వారిని ఏకం చేసే వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ సభకు కేంద్ర ఉక్కు, గనుల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అధ్యక్షత వహించనున్నారని తెలిపారు. పలువురు ప్రముఖులకు పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అవార్డ్స్ కమిటీ చైర్మన్ కంతేటి వెంకటరాజు, సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్పీఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు నమోదులో అలసత్వం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి




**గుంటూరు, పెన్ పవర్, జులై, 11 :** దేశావ్యాప్తంగా జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని , ఓటు హక్కు నమోదులో అలసత్వం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఓటు అనేది అత్యంత పవిత్రమైన ఆయుధమని దానిని ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రతీ ఒక్కరూ దానిని పొందాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్ ) కార్యక్రమంలో భాగంగా శ్రీనివాసరావుతోటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో పాల్గొని ప్రజల్లో అవగాహనా కల్పించ్చారు. ఈ సందర్భంగా సర్ కార్యక్రమం ద్వారా ఓట్ల ప్రక్షాళన జరుగుతుందన్నారు. చనిపోయిన వారి ఓట్లు , డూప్లికేట్ ఓట్లు , ఒకే వ్యక్తికి పలు చోట్ల ఉన్న ఓట్లని తొలగించే ప్రక్రియ జరుగుతుందని ప్రజలు దీనికి సహకరించ్చాలన్నారు. ఓటు విలువను కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు పొందటం అనేది ఆత్మ గౌరవంతో సమానమన్నారు. బీ యల్ వో లు ఇంటికి వచ్చినప్పుడు తరువాత చూద్దాం అనొద్దని , ఓటు హక్కు పొందేందుకు ఇదే చివరి అవకాశమన్నారు. మంచి సమాజాన్ని నిర్మించాలన్నా , గొప్ప నాయకుణ్ణి తయారు చేయాలన్నా అది ఒక్క ఓటుతోనే సాధ్యమన్న విషయాన్ని గుర్తెరగాలని ప్రజల్ని కోరారు. ఓటు హక్కు లేకపోతే మనిషి ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించ్చారు. ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా సర్ కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేద్దామన్నారు.ఓటు హక్కు వినియోగం అంటే ఐదేళ్లకు వచ్చే వేడుక కాదని , ప్రతీ రోజూ బతికే విధానమని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో బీ యల్ వో శోభారాణి, టీడీపీ మహిళ నాయకురాలు సవరం రాజ్యలక్ష్మి , 22వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు చింతకాయల వెంకట సాయి , బిజెపి సీనియర్ నాయకులు అప్పిశెట్టి రంగా , జనసేన నాయకులు కోలా అంజి , దేవరశెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల వసతుల పెంపునకు చర్యలు

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ) పెన్ పవర్, జూలై 11 :** రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని దక్షిణ కోస్తా రైల్వే జీఎం సందీప్ మాథ్యూర్ విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా, ఇతర అధికారులతో కలసి శనివారం కొవ్వూరు, గోదావరి స్టేషన్‌లలో ప్రయాణికుల సౌకర్యాలపై సమగ్ర తనిఖీ చేశారు. ముందుగా రాజమండ్రి స్టేషన్‌లో జరుగుతున్న స్టేషన్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపర్చేందుకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గోదావరి, కొవ్వూరు స్టేషన్‌లను తనిఖీ చేసి పుష్కరాలకు తరలివచ్చే భక్తుల రద్దీ నివారణ చర్యలపై అధికారులతో సమీక్షించారు. రైల్వేస్టేషన్‌ల నుంచి నదీ తీరానికి మధ్య యాత్రికుల రాకపోకలను అంచనా వేసేందుకు పుష్కర ఘాట్, మార్కండేయ ఘాట్, శ్రద్ధానంద్ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్‌లతో సహా ప్రధాన స్నాన ఘాట్‌లను తనిఖీ చేశారు. అనంతరం రాజమండ్రిలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షించారు. పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది ప్రయాణికుల భద్రత, జన సమూహ నిర్వహణ వ్యూహాలు, అత్యవసర వైద్య ఏర్పాట్లపై సమీక్షించారు. భారీ సంఖ్యలో వచ్చే ప్రయాణికులను సమర్థంగా నిర్వహించేందుకు రైల్వే, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తుందని జీఎం తెలిపారు. ఈ సమావేశంలో రాజమండ్రి జిల్లా ఎస్పీ డి.నరసింహా కిషోర్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్‌గుప్తా, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ బీఎస్‌కే రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ సాంబశివరావు, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఏకే సిన్హా తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌తో శాశ్వత పరిష్కారం

## ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి

**చిలకలపూడి(మచిలీపట్నం) పెన్ పవర్, జూలై 11:** వివాదాలకు దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవనం గడపాలంటే జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శనివారం ఆయన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మనిషి జీవితంలో ఆనందం ఎంతో ముఖ్యమని అదే ఆయుష్షును పెంచుతుందన్నారు. దీనికోసం వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. కోర్టుల చుట్టూ సంవత్సరాల పాటు తిరుగుతూ సమయం, నగదు వృథా చేసుకునే బదులు పరస్పర రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటే ఇరుపక్షాలు సంతృప్తితో ప్రశాంతంగా జీవించగలరన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.వరలక్ష్మి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.సునీత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**1,15,261 కేసుల పరిష్కారం :** లోక్‌అదాలత్‌లో 1,15,261 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 45 బెంచ్‌ల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. వీటిలో 1,07,628 క్రిమినల్ కేసులు, 439 సివిల్ కేసులు, 692 చెక్‌బౌన్స్ కేసులు, 6356 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించామన్నారు. 146 మోటారు వాహన ప్రమాద క్లయిమ్‌లకు రూ. 9.2 కోట్లు నష్టపరిహారంగా చెల్లించేందుకు అంగీకరించాయన్నారు. మచిలీపట్నం కోర్టులో 9182 కేసులు, విజయవాడలో 33,971, గుడివాడలో 15,237, నందిగామలో 11,430, నూజివీడులో 11,669, మైలవరం 1830, జగ్గయ్యపేట 4735, బంటుమిల్లిలో 2238, కై కలూరులో 1053, తిరువూరులో 5313, గన్నవరం 9821, అవనిగడ్డలో 3160, మొవ్వ 2284, ఉయ్యూరు 3338 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.

# లోక్‌అదాలత్‌లో 26,805 కేసులు పరిష్కారం

**విజయవాడ :** విజయవాడ కోర్టులో మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, రెండవ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి భారీ స్పందన లభించింది. 15 మంది న్యాయమూర్తుల ఆధ్వర్యంలో 15 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 437 సివిల్ కేసులు, 29 ప్రీ లిటిగేషన్ కేసులు, 26,339 క్రిమినల్ కేసులు, మొత్తం 26,805 కేసులను పరిష్కరించినట్లు రెండవ అదనపు జిల్లా జడ్జి సునీల్ నాయక్ తెలిపారు.

**11 ఏళ్ల నాటి కేసుకు మోక్షం :** పదకొండేళ్లుగా పరిష్కారానికి నోచుకోని పార్టీషన్ దావా కేసును జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించినట్లు 16వ అదనపు జిల్లా న్యాయమూర్తి పగడాల శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని కోర్టు సముదాయం ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన గుంజా శ్రీనివాసరావు తన తండ్రి మరణానంతరం 2015లో జిల్లా కోర్టులో పార్టీషన్ దావా దాఖలు చేశారన్నారు. రూ.ఐదు కోట్ల విలువ చేసే ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి, ఇల్లుకు సంబంధించిన దావాను నలుగురు కుమార్తెలు, నలుగురు కుమారులతో మాట్లాడి పరిష్కరించినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని విలువైన సమయాన్ని ఆదా చేసుకోవాలని చెప్పారు. కక్షిదారులకు లోక్ అదాలత్‌పై అవగాహన కలిగించి ఏళ్ల తరబడి సాగుతున్న కేసును లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా కృషి చేసిన సీనియర్ న్యాయవాది ఈశ్వరప్రగడ రంగారావును ఆయన అభినందించారు.

**431 కేసులు.. రూ. 9.24 కోట్లు :** నందిగామలోని 16వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుల పరిధిలోని 431 కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించి రూ.9,24,55,107ను కక్షిదారులకు అందించినట్లు న్యాయమూర్తి శ్రీనివాసరావు తెలిపారు. వీటితో పాటు జరిమానాలు విధించిన 11 వేల కేసులు పరిష్కారమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు వనపల్లి సత్యలక్ష్మీప్రసన్న, షేక్ రియాజ్, వందన, న్యాయవాదులు మన్నెం నారాయణరావు, మట్టా ప్రసాద్, అద్దంకి మణిబాబు, ఆనందం విజయభాస్కర్, చిరుమామిళ్ల కిరణ్, మంగయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

# విహార యాత్ర మిగిల్చిన విషాదం

## వియత్నాం దేశంలోని ఫు క్వాక్‌లో పడవ ప్రమాదంలో మచిలీపట్నంకు చెందిన జయశ్రీ దుర్మరణం

## ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన ఆమె భర్త, ప్రముఖ వ్యాపారి గెల్లి కిషోర్

**మచిలీపట్నంటౌన్ పెన్ పవర్, జూలై 11:** వియత్నాం దేశంలోని ఫు క్వాక్ సముద్ర తీరంలో శనివారం ఉదయం జరిగిన ఘోర పర్యాటక బోటు ప్రమాదంలో కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గెల్లి కిషోర్ భార్య మరణించింది. కిషోర్ ప్రాణాపాయ స్థితిలో ఉండగా, ఆయనకు సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన మచిలీపట్నంలో తీవ్ర విషాదాన్ని నింపింది. లావా సెల్ కంపెనీ తమ వ్యాపార భాగస్వాములు, డీలర్లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన విదేశీ పర్యటనలో భాగంగా గెల్లి దంపతులు వియత్నాం టూర్‌కు వెళ్లారు. మూడు రోజుల క్రితం ఈ టూర్‌కు వెళ్లారు. వీరు శనివారం వియత్నాంలోని ఫు క్వాక్ ప్రాంతంలో ఆన్ థోయ్ ద్వీప సమూహం సమీపంలోని హోన్ మే రుట్ వద్ద పర్యాటకులతో కలసి స్పీడ్‌బోట్‌లో విహారయాత్రకు బయలుదేరారు. సముద్రంలో ఒక్కసారిగా వాతావరణం మారడంతో బలమైన గాలులు, ఎత్తైన కెరటాల ధాటికి బోటు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బోటులో ఉన్న పలువురు నీటిలో చిక్కుకోగా, సహాయక బృందాలు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించాయి. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన యాత్రికులు సహా మొత్తం 32 మంది మృతి చెందినట్లు వియత్నాం ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించింది. మృతుల్లో మచిలీపట్నానికి చెందిన గెల్లి జయశ్రీ ఉన్నారు. స్థానిక సర్కిల్‌పేటలోని కంచి కామాక్షమ్మ ఆలయ సమీపంలో సాయిబాబా గుడి పక్కన నివాసముండే గెల్లి కిషోర్ భార్య జయశ్రీ మృతితో గెల్లి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే స్థానిక వ్యాపార వర్గాలు దిగ్భ్రాంతి చెందాయి. గెల్లి కిషోర్ మచిలీపట్నంలో కిళ్లీ సామగ్రి దుకాణంతో పాటు లావా, టాటా ఇండికాం, టాటా సెల్యులర్ డీలర్‌గా గత 30 సంవత్సరాలుగా వ్యాపారం నిర్వహిస్తున్నారు.

**కలెక్టర్‌ను సంప్రదించిన కిషోర్ కుమారుడు ఆకాష్**

వియత్నాంలో పడవ ప్రమాదంలో మృతి చెందిన తన తల్లి జయశ్రీ మృతదేహంతో పాటు ప్రాణాపాయం నుంచి బయటపడ్డ తండ్రి కిషోర్‌ను స్వస్థలానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆకాష్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కోరారు. కృష్ణాజిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కూడా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయటంతో స్పందించిన కలెక్టర్ ఎంబసీ అధికారులతో మాట్లాడి జయశ్రీ మృతదేహం త్వరితగతిన మచిలీపట్నంకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషాద ఘటనపై మచిలీపట్నంలోని ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కిషోర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# జాతీయ లోక్ అదాలతో 1225 కేసులు పరిష్కారం

**రేపల్లె పెన్ పవర్, జూలై 11:** న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలలో మొత్తం 1225 కేసులు పరిష్కరించినట్లు తెనాలి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కరించిన కేసుల్లో 29 సివిల్, 1196 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. లోక్ అదాలత్ ద్వారా వేగవంతంగా పరస్పర సమ్మతితో వివాదాలు పరిష్కారం కావడం వల్ల ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు. తెనాలి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ) పెన్ పవర్, జూలై 11** ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. గుంటూరు వికాస్‌నగర్‌కు చెందిన రాయపాటి కోటి సుధాకర్ (సుబ్బారావు) ఆలయ అధికారులను కలిసి అన్నదానానికి రూ. 1,08,616 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ డీఈఓ కిశోర్‌కుమార్, అర్చకుడు రంగావఝుల శ్రీనివాసశాస్త్రి దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

## 15 నుంచి వారాహి అమ్మవారి నవరాత్రోత్సవాలు

**తెనాలి ,పెన్ పవర్, జూలై 11 :** కొల్లిపర మండల గ్రామం కుంచవరంలోని శ్రీవారాహి దేవాలయంలో ఈనెల 15 నుంచి 24వ తేదీవరకు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు, దీక్షాధారణ ఉత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు ఉత్సవాల ఆహ్వానపత్రికను శనివారం స్థానిక మారీసుపేటలోని పోస్టల్ సహకార సొసైటీ భవనంలో శ్రీకాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ గౌరవ చైర్మన్ డీఎల్ కాంతారావు ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త, 'పోస్ట్' స్వచ్ఛంద సంస్థ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు మాట్లాడుతూ పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి చేతుల మీదుగా ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు, హోమాలు, కుంకుమ పూజలు, మధ్యాహ్నం సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, కల్యాణం శ్రీనివాసరావు, పీఎస్సార్ బ్రహ్మాచార్యులు, జగదీష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## భాషా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

**గుంటూరు ,పెన్ పవర్, జూలై 11:** న్యాయవాదులుగా రాణించాలంటే భాషా నైపుణ్యాలు పెంపొందించుకోవడం కీలకమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. శనివారం జేకేసీ కళాశాల రోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళి (జేసీ) న్యాయ కళాశాల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఇరువురు న్యాయమూర్తులు న్యాయ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి కుప్పుస్వామి, ఉపాధ్యక్షుడు డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్, కోశాధికారి రాయపాటి వెంకట కోటేశ్వర ప్రసాద్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.గోపీచంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ సుధాకర్ బాబు, పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

**నాదెండ్ల,పెన్ పవర్, జూలై 11 :** ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఆర్. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... నుదురుపాడు గ్రామానికి చెందిన పారెళ్ళ అనిల్‌కుమార్ (27) కేరళలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో తమ బంధువు మృతి చెందటంతో ద్విచక్రవాహనంపై వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో నాదెండ్ల–అప్పాపురం డొంక రోడ్డులో ద్విచక్రవాహనం అదుపుతప్పి గోతిలో పడింది. స్థానికులు గమనించి 108కు సమాచారమిచ్చారు. అనిల్‌కుమార్‌ను చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని శనివారం పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించటంతో స్వగ్రామమైన నుదురుపాడుకు తరలించారు.

## వరిగడ్డి వామి దగ్ధం రాష్ట్ర స్థాయి రాప్ బిలియర్డ్స్ గేమ్ జోన్ విజేతగా శివశర్మ

**నకరికల్లు ,పెన్ పవర్, జూలై 11 :** మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో వరిగడ్డి వామి దగ్ధమైంది. ఈ సంఘటన గ్రామంలోని ఎస్సీ కాలనీలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన డి.పెదలాజర్ నాలుగెకరాల వరిగడ్డిని సుమారు రూ.50 వేలతో కొనుగోలు చేసి నిల్వ చేశాడు. శనివారం ఉదయం సమయంలో వరిగడ్డికి నిప్పంటుకుంది. చుట్టుపక్కల వారు గమనించే సరికి మంటలు చెలరేగాయి. నీళ్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పిడుగురాళ్ల ఫైరింజన్ యంత్రాంగం గ్రామానికి చేరుకొని మంటలను అదుపు చేసింది. అప్పటికే వరిగడ్డి మొత్తం అగ్నికి ఆహుతైంది. అసలే మేత దొరకని గడ్డుకాలం వస్తున్న తరుణంలో తమకు భారీ నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**తెనాలిరూరల్ ,పెన్ పవర్, జూలై 11 :** రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలి రైల్వే స్టేషన్ ఐదో నంబరు ప్లాట్‌ఫాంపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి ఐదో నంబరు ప్లాట్‌ఫాం పట్టాలపై ఆత్మహత్యాయత్నం చేశాడు. కాళ్లు తెగిపోయి తీవ్ర రక్తస్రావమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు బాలికలు అదృశ్యం

**తాడేపల్లిరూరల్ ,పెన్ పవర్, జూలై 11 :** ఇద్దరు బాలికల అదృశ్యంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాలు : మంగళగిరి–తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట, అంబేద్కర్ కాలనీలో బాలికలు వారి తల్లిదండ్రుల కలసి నివాసం ఉంటున్నారు. మొహరం కుమార్తె ఇస్రా, అస్మతున్నిసా కుమార్తె నూర్‌జహాన్ కనిపించకుండా పోయారంటూ తాడేపల్లి పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఉదయం సమయంలో తాడేపల్లి ప్రెస్ క్లబ్ వద్ద మంగళగిరి వెళ్లే ఆటోలో వెళ్లినట్లు సీసీ ఫుటేజీల్లో గుర్తించారు.

## 'సర్' ప్రక్రియ వేగవంతం చేయాలి

**వేమూరు పెన్ పవర్, జూలై 11 :** సర్ కార్యక్రమంలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న సర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేమూరు నియోజక వర్గంలోని సర్ కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందోనని బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలన్నారు. నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో ఆన్‌లైన్ విధానం వంద శాతం పూర్తి చేయాలని నియోజక వర్గం ఎన్నికల అధికారి, బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్‌కు సూచించారు. తహసీల్దారు పార్వతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

**బాపట్ల ,పెన్ పవర్, జూలై 11 :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (సర్) కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని దేవుడి మాన్యం 11వ వార్డు, సచివాలయ 2, పోలింగ్ స్టేషన్ 96లో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రక్రియ ఏవిధంగా జరుగుతుందని ఓటర్లును అడిగితెలుసుకున్నారు. కలెక్టర్ వెంట బాపట్ల ఆర్డీఓ ఎ.హరి కుమార్, డీఆర్డీఏ పీడీ బి.సింగయ్య, మున్సిపల్ కమిషనర్ ఎం.హాసిని, సూపర్ వైజర్, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 2476 కేసులు పరిష్కారం

**నరసరావుపేట టౌన్ పెన్ పవర్, జూలై 11 :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం న్యాయస్థాన భవనాల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, 13వ అదనపు జిల్లా సెషనన్స్ న్యాయాధికారి ఎస్. రమేష్ నేతృత్వంలో న్యాయాధికారులు మూడు బెంచ్ లుగా ఏర్పడి 2476 కేసులను పరిష్కరించారు. సివిల్, క్రిమినల్ కేసులతోపాటు ముందస్తు వ్యాజ్యాలు తదితర అన్ని రకాల వ్యాజ్యాలు కలిపి 2476 కేసులు పరిష్కారమయ్యాయి. పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు రూ. 5,88,78,243 మేరకు లబ్ధి చేకూరింది. తొలుత న్యాయస్థాన ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయాధికారులు లోక్ అదాలత్ ప్రాధాన్యతను, విశిష్టతను, ఉపయోగాలను వివరించారు. న్యాయధికారులు కిరణ్ కుమార్, ఎ.సలోమి, న్యాయవాద సంఘ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత ఉట్టి పడేలా రంగులు

### అన్నదానం, లడ్డూపోటులను పరిశీలించిన దేవదాయ శాఖ కమిషనర్

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ) పెన్ పవర్, జూలై 11 :** ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వెల్లివిరిసేలా అన్ని భవనాలకు ఒకే తరహా రంగులు వేయాలని దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ దుర్గగుడి అధికారులకు సూచించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, లడ్డూపోటులను శనివారం పరిశీలించారు. కమిషనర్ వెంట చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, డీఈవో కిషోర్‌కుమార్, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఉన్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు అమ్మవారి సన్నిధికి చేరుకునేసరికి ఎంతో ప్రశాంతతను ఇచ్చేలా రంగులను ఎంపిక చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. లడ్డూ పోటు వెలుపల వేసిన రంగుల శాంపిల్స్‌ను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. పెయింటింగ్, ఫ్లోరింగ్ పనులను పరిశీలించిన అనంతరం సెల్లార్‌కు చేరుకున్నారు. సెల్లార్‌ను పూర్తి స్థాయిలో భక్తుల అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మహామండపం 7వ అంతస్తులోని ప్రాకార ప్రాంతాన్ని సందర్శించారు ప్రాకార మండపానికి వేసిన రంగుల తరహాలోనే నూతన భవనాలను పెయింటింగ్ జరగాలన్నారు. కమిషనర్ పర్యటనలో ట్రస్ట్ బోర్డు సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పి.రాఘవరాజు, ఈఈ ఎల్.రమాదేవి, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

**ఏలూరు (టూటౌన్) పెన్ పవర్, జూలై 11 :** కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఉ మ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్.శ్రీదేవి చెప్పారు. శనివారం స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో 2వ జాతీయ లోక్‌అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కక్షిదారుల మధ్య సామర స్య వాతావరణంలో విభేదాలు తగ్గించేందుకు, కేసు ల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహి స్తున్నామని చెప్పారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. వాహన ప్రమాద బీమా కేసులో టాటా జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.20 లక్షల చెక్కులను కక్షిదారులకు అందజేశారు. 1వ అదనపు జిల్లా జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని, 2వ అదనపు జిల్లా జడ్జి ఎం.మీనాదేవి, 5వ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ, 8వ అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనె సీతారాం, ప్రభుత్వ న్యాయవాది సుబ్రహ్మణ్యం, లోక్ అదాలత్ సభ్యుడు అబ్బినేని వి జయకుమార్ పాల్గొన్నారు. కక్షిదారులకు సీతారాం ఆహార పొట్లాలను అందజేశారు.

7,890 కేసుల రాజీ : 7,890 కేసులను రాజీ చేశారు. వీటిలో 7,437 క్రిమినల్, 215 సివిల్, 185 వాహన ప్రమాద, 53 ప్రీలిటిగేషన్ కేసులు రాజీ చేసినట్టు తెలిపారు. వాహన ప్రమాద బీమా కేసులకు సంబంధించి రూ.12.18 కోట్లు పరిహారంగా చెల్లించారు.

## రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.76 లక్షల పరిహారం

**విజయవాడలీగల్ పెన్ పవర్, జూలై 11 :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఏడవ అదనపు జిల్లా జడ్జి బి.అబ్రహం విజయవాడ కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్ లో రూ.76 లక్షల పరిహారం ప్రకటిస్తూ అవార్డు జారీ చేశారు. ఈ.శ్రీనివాస్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు 2025లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన భార్య లక్ష్మీ ప్రసన్న, కుమార్తె, కుమారుడు బీమా కంపెనీ నుంచి కోటి రూపాయలు పరిహారం కోరుతూ న్యాయవాది ఇసంశెట్టి ఉషాజ్యోతి ద్వారా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చోళ మండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ.76 లక్షలు పరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు. ఇరుపక్షాలు రాజీ మార్గంలో కేసు పరిష్కరించుకోవటానికి అంగీకరించడంతో న్యాయమూర్తి అబ్రహం ఇరుపక్షాల న్యాయవాదుల సమక్షంలో బాధితులకు అవార్డు కాపీ అందజేశారు.

## క్షేత్రంలో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

### గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

**ద్వారకాతిరుమల పెన్ పవర్, జూలై 11 :** ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో ఆన్‌లైన్ సేవలకు శనివారం ఉదయం అంతరాయం ఏర్పడింది. దీంతో స్వామివారి దర్శనం, మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా కల్యాణకట్ట వద్ద మొక్కులు తీర్చుకునే భక్తులు టికెట్ల కోసం గంటల తరబడి వేచి ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచి సర్వర్‌లో సమస్య తలెత్తడంతో ఆన్‌లైన్ సేవలు నెమ్మదించాయి. కొంతసేపు పనిచేసిన సర్వర్ మధ్య మధ్యలో నిలిచిపోవడంతో టికెట్ల జారీ ప్రక్రి య మందగించింది. దీంతో కల్యాణకట్ట ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది.

**ఆఫ్‌లైన్‌లోనూ సమస్యలే :** సమస్యను గుర్తించిన దేవస్థానం అధికారులు బ్యాంకు పీఓఎస్ మెషీన్ల ద్వారా ఆఫ్‌లైన్ సేవలు ప్రారంభించినా, కొంత సమయం పాటు అవి కూడా మొరాయించాయి. కియోస్క్ మెషీన్లు సైతం నెమ్మదిగా పనిచేయడంతో భక్తుల నిరీక్షణ మరింత పెరిగింది. దీంతో సిబ్బంది కేశఖండనశాల వద్ద ప్రత్యేకంగా కంప్యూటర్ ఏర్పాటు చేసి టికెట్లు జారీ చేసేందుకు ప్రయత్నించారు. అయితే సర్వర్ సమస్య కొనసాగడంతో ఆ ప్రయత్నాలు కూడా సకాలంలో ఫలించలేదు.

**కౌంటర్ల వద్ద భారీ రద్దీ :** దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయాల కౌంటర్ల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్ సేవా కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరారు. చిన్నపిల్లలు, వృద్ధులతో వచ్చిన వారు గంటల తరబడి వేచి ఉండాల్సి రావడంతో అసహనం వ్యక్తం చేశా రు. మనమిత్ర వాట్సాప్ సైతం పనిచేయకపోవడంతో భక్తులు గగ్గోలు పెట్టారు. మధ్యాహ్నం వరకూ ఆన్‌లైన్ కష్టాలు కొనసాగాయి.

**కల్యాణకట్ట ప్రాంతంలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ వద్ద, కియోస్క్ మెషీన్ వద్ద పోటెత్తిన భక్తులు**

కేశఖండనశాల వద్ద టికెట్ అడిగితే సర్వర్ పనిచేయడం లేదన్నారు. దీంతో గంట సమయం అక్కడే వేచి ఉన్నా. ఆ తర్వాత దర్శనం టికెట్ కోసం మరో గంటకు పైగా సమయం పట్టింది. ఇన్ని ఇబ్బందులు ఎప్పుడూ పడలేదు. దేవదాయశాఖ అధికారులు భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి.

# ఏపీలో మరో కూటమి

ఏపీలో మరో కూటమి అవతరించనుందా? వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం ఉన్న కూటమికి పోటీగా ఇది మారనుందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. 2024 ఎన్నికల సమయంలో కూటమి కట్టిన టీడీపీ, బీజేపీ, జనసేనలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయి. పైగా వచ్చే ఎన్నికల్లోనూ అంతే బలంగా ముందుకు సాగాలని కూటమి నిర్ణయించుకుంది. దీంతో ప్రస్తుతం ఉన్న కూటమి యేతర పార్టీలు ఒంటరి పోరాటం కంటే కలిసి నడిస్తేనే బెటర్ అన్న ఆలోచనకు వచ్చినట్టు గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది కమ్యూనిస్టుల చొరవ ప్రత్యేకంగా కొత్త కూటమి కట్టే విషయంలో కమ్యూనిస్టులు చొరవ చూపిస్తున్నారు. రాష్ట్ర విభజన కు ముందు... కమ్యూనిస్టులకు కొన్ని నియోజకవర్గాల్లో ప్రాబల్యం ఉంది. అయితే.. విభజన తర్వాత.. తెలంగాణలో పట్టు నిలుపుకొన్నప్పటికీ.. ఏపీలో కోల్పోయారు. సీపీఐ, సీపీఎంలు ఇప్పటి వరకు జరిగిన 2014, 2019, 2024 ఎన్నికల్లో పోటీ చేయడమే తప్ప.. గెలిచిందే లేదు. 2019లో జనసేనతో పొత్తు పెట్టుకున్నా.. ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు రెండేళ్ల ముందే కూటమి కట్టే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. కలిసొచ్చే పార్టీలను కమ్యూనిస్టులు రహస్యంగా కలుస్తున్నారని తెలుస్తోంది. ప్రధానంగా వైసీపీ నేతలను ఓ కీలక కమ్యూనిస్టు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు కలిశారని.. పొత్తు పెట్టుకు ని ముందుకు వెళ్దామని ఆయన సూచించినట్టు వైసీపీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. జగన్‌కు సన్నిహితుడై న సదరు నేత సూచనలను వైసీపీ కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కూటమిని చీల్చే ప్రయత్నం చేసినా.. అది ఫలించలేదు. ఈ నేపథ్యంలో తాము కూడా ఓ కూటమిగా ముందుకు వెళ్లేందుకు జగన్ కూడా సుముఖంగానే ఉన్నారని వైసీపీ నాయకులు తరచుగా చెబుతున్నారు. ''ఒంటరి ప్రయాణం మంచిదే. అయితే..కూటమిగా వెళ్తే మరింత తేలికగా.. విజయం దక్కించుకోవచ్చు'' అని కృష్ణా జిల్లా కు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. ఇక, ఈ కూటమిలో కాంగ్రెస్ కూడా ఉంటుందన్న టాక్ వస్తోంది. అయితే.. కాంగ్రెస్ పార్టీ ఈ కూటమిలో ఉంటే వైసీపీ ఉండదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక, చిన్న చితకా పార్టీలు.. కూడా చేతులుకలిపి కొత్త కూటమి ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయన్నది రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ.
మరి ఏం జరుగుతుంది? ఈ కూటమి ఏర్పడుతుందా? లేదా? అనేది కొన్నాళ్లు వెయిట్ చేసి చూడాల్సిందే.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి

**విశాఖపట్టణం, జూలై 11, పెన్ పవర్:** పీవీఎన్.మాధవ్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సుపరిచితమైన పేరు. కమలం పార్టీ ఆంధ్రప్రదేశ్ సారథిగా సరిగ్గా ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతృత్వంలో ఏపీలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2025 జూలై 8న ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. దగ్గుబాటి పురంధేశ్వరి నుంచి ఈ హోదా అందుకున్న ఆయన ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించిన యువ నాయకుడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ చదివిన ఆయన 2017లో గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఉత్తరాంధ్రకు చెందిన బీసీ వర్గానికి చెందిన ఆయన తండ్రి పీవీ చలపతిరావు ఏకీకృత ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ కుటుంబ వారసత్వం, సంస్థాగత అనుభవం ఆయన నియామకానికి కారణమయ్యాయి. విజయవాడలో ఏబీవీపీ స్థాపన దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీలో మాధవ్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు పూలమాల వేసి, తెలుగు కవి విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి మాలలు వేశారు. లెనిన్ సెంటర్‌ను విశ్వనాథ సత్యనారాయణ పేరిట మార్చాలని డిమాండ్ చేశారు. 'పార్టీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లి, గ్రాస్‌రూట్ స్థాయిలో బలోపేతం చేస్తాం. ప్రతి కార్యకర్త నాయకుడిలా భావించి, క్రమశిక్షణతో, జాతీయ స్ఫూర్తితో పనిచేయాలి' అని ప్రతిజ్ఞ చేశారు. అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పురంధేశ్వరి ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.మాధవ్ నాయకత్వంలో బీజేపీ సంస్థాగతంగా చురుకుగా ముందుకు సాగుతోంది. 2026 జూన్ 30న రాష్ట్రంలోని 28 జిల్లాలకు ఇన్‌ఛార్జిలను నియమించారు. ఇది పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలపరచడానికి చేపట్టిన చర్య. 'మన ఊరు -- మన జెండా' కార్యశాలలు నిర్వహించి, పార్టీ సిద్ధాంతాలు, సేవా కార్యక్రమాలను గ్రామ గ్రామానికి, ఇంటింటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.
కొత్త జిల్లాలతో కమిటీలు ఏర్పాటు చేసి, గ్రామ స్థాయి నుంచి బూత్ వరకు నిర్మాణం పటిష్టం చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కూటమి ప్రభుత్వంలో బీజేపీకి నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల టికెట్ల విషయంలో క్యాడర్‌లో అసంతృప్తి ఉందని ముందుగా చెప్పినట్లే ఉంది. అయితే మాధవ్ నాయకత్వంలో బీజేపీ మరింత ప్రాధాన్యత సాధించాలని, ఎమ్మెల్యేలు, ఎంపీల సంఖ్యను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడం, కూటమిలో బీజేపీకి మరిన్ని అవకాశాలు కల్పించడం వైపు దృష్టి పెట్టారు. రెండేళ్ల కూటమి పాలనలో రాజ్యసభలో రెండు సీట్లు, ఒక ఎమ్మెల్సీ సీటు దక్కినప్పటికీ, మరిన్ని కీలక పదవులు కోరుతున్నారు.2026 జూన్‌లో తిరుపతిలో ఎన్డీఏ విజయోత్సవ సభలో మాధవ్ మాట్లాడుతూ, 'డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్ర అభివద్ధి వేగంగా జరుగుతోంది. రూ.14 లక్షల కోట్ల ప్రాజెక్టులు వాస్తవరూపం దాలుస్తున్నాయి' అని చెప్పారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కూటమి విజయాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నేతత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ప్రశంసించారు. యువతను వికసిత భారత్ కోసం రాజకీయాల్లోకి రావాలని, సాంకేతికత, ఆవిష్కరణలపై దష్టి పెట్టాలని సూచించారు.మాధవ్ తన ఏడాది కాలంలో పార్టీ బలం గణనీయంగా పెరిగిందని, మరింత పుంజుకుంటామని చెప్పారు. సంస్థాగత నిర్మాణం బలపడిందని, అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అయితే క్యాడర్‌లో అధికారంలో ఉన్నామా అన్న అనుమానం ఉందని, ఇంకా జోరు పెంచాలని అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరు సీనియర్ నాయకులు నిశ్శబ్దంగా ఉన్నారని, స్థానిక సంస్థల టికెట్లలో బీజేపీకి తగిన వాటా రావాలని ఒత్తిడి ఉంది. అయితే మాధవ్ నాయకత్వంలో 28 జిల్లాల ఇన్‌ఛార్జిల నియామకం, గ్రామ స్థాయి కార్యక్రమాలు పార్టీని మరింత చురుకుగా మార్చాయని అభిప్రాయం కూడా ఉంది. మొత్తం మీద ఏడాదిలో సంస్థాగతంగా కొన్ని అడుగులు ముందుకు పడ్డాయి, కానీ క్యాడర్‌లో మరిన్ని ఫలితాలు ఆశిస్తున్నారుఇది మాధవ్ ఏడాది కాలంలో జరిగిన ముఖ్య అంశాల సమగ్ర సమీక్ష. పార్టీ బలోపేతం కోసం ఇంకా చేయవలసినవి చాలా ఉన్నాయని నాయకులు అభిప్రాయపడుతున్నారు.

## పరుగులు పెడుతున్న అమరావతి

**విజయవాడ, జూలై 11, పెన్ పవర్:** తెలంగాణ ఉద్యమం ప్రాంతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఆ సమయంలో పార్టీల, వర్గాల ఒక లక్ష్యం కోసం కట్టుబడ్డారు. ఆ యుద్ధ భావనతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది. ఆంధ్రాప్రాంత ప్రజలు వ్యతిరేకించినా.. తెలంగాణ మొత్తం ఏకమైంది. లక్ష్యం చేరుకుంది. అలాంటి ఐక్యత ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో కనిపించడం లేదు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా రాజధాని లేని రాష్ట్రంగానే మిగలిపోయింది. సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి కోసం సంకల్పం తీసుకున్నారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. రాజధాని నిర్మాణ పనలూ వేగంగా జరుగుతున్నాయి. అయితే ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిని వ్యతిరేకించడంతో రాజధానికి అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రాజకీయ వాతావరణం, వ్యక్తిగత వ్యూహాలు, అధిష్టాన ఉద్దేశాల కారణంగా సమస్య మరింత క్లిష్టంగా మారింది.ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి ఒక బ్రాండ్ తీసుకురావడానికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారు. అమరావతి పరపతి మాత్రమే కాదు, హక్కు కూడా. పార్లమెంట్ ద్వారా అమరావతిని రాష్ట్ర రాజధానిగా ధ్రువీకరించి తీర్మానం ఉన్నప్పటికీ, అమరావతి ప్రాధాన్యతను అభివృద్ధి, ఆర్థిక పునర్రూపకల్పన, రైతు సంకల్పంతో కూడిన సామాజిక ఒప్పందంగా చూడాలి. ఎన్నో వేల ఎకరాలు దిగుబడిలేని భూములను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకున్నారు. ప్రాజెక్టులు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల రూపొందింపు ఈ పట్టదారుల ఆశలపై ఆధారపడి ఉన్నాయి.అయితే రాజకీయంగా పరిస్థితి మరోలా ఉంది. రాష్ట్రపతి స్థాయిలో అమరావతి నిర్ణయాన్ని సైతం మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యతిరేకిస్తున్నారు.అధికారంలో ఉన్నప్పుడు, అధికారం కోల్పోయిన తర్వాత కూడా రాజధాని నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నారు. భవిష్యత్‌లో 'మావిగన్' అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. ఇలాంటి రాజకీయ వ్యతిరేకతలు అమరావతికి ఆటంకంగా మారుతున్నాయి.పార్లమెంటు ఆమోదం ఉన్నా, రాష్ట్ర స్థాయిలో అమలుకు అనేక సాంకేతిక, న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. భూమి బదిలీలు, ప్రాజెక్ట్ ఫండింగ్, స్థానిక సంస్థల మంజూరు, వ్యవసాయ పరిష్కారాల అమలు వంటి పనులు అంతులేని కార్యయజ్ఞాలుగా మారతాయి. పెట్టుబడుల ప్రవాహం, మౌలిక వసతుల బహిర్గతత, ప్రభుత్వ లాజిస్టిక్స్ అన్ని సమన్వయం కావాలి. ఇదే సమయంలో రాజకీయ ఆందోళనలు, సహకారంతో కూడని పరిస్థితులు ఈ పనులను ఆలస్యం చేస్తాయి. అమరావతి నిర్మాణం వలన ఏర్పడే ప్రత్యక్ష ప్రయోజనాలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. స్థానిక ఉపాధి అవకాశాలు, దారిద్ర్య తగ్గింపు, నగరీకరణ ద్వారా సేవల అందుబాటు. అయితే ఈ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఆలస్యాలు, వివాదాలు ఎక్కువైతే రైతుల ఆర్థిక భరోసా విచ్ఛిన్నం అవుతుందని భయంకరం. ప్రత్యేకంగా భూములను ఇచ్చిన రైతులు వారి జీవనాధారం మెరుగుపడుతుంది. రైతుల హక్కులు, పునరావాసం, పరిహారం, భవిష్య రక్షణ వంటి అంశాలు చట్టపరంగా భరోసా ఇవ్వాలి.అమరావతి నిర్మాణం ప్రజల ఆశలు, ఆశయాలతో కూడిన సంకల్పం. రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని సంక్లిష్టం చేయడం బాధాకరం. రాజధాని ఇబ్బందులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ రాష్ట్రాన్ని ఇంకా ఎంతకాలం రాజధాని లేకుండా చేస్తారు. ఇప్పటికైనా ప్రజల్లో మార్పు రావాలి. రాజధాని కోసం అందరూ ఏకం కావాలి. తెలంగాణ తరహాల్లో ఐక్యంగా ముందుకు సాగాలి. అమరావతి నిలబడాలంటే నాయకత్వం పారదర్శకంగా, నిబద్ధతతో, ప్రజా ఆశల ప్రకారం ఆచరణలో కనిపించాలి.

# చిన్నమ్మ సంగతి ఏంటీ

**రాజమండ్రి, జూలై 11, పెన్ పవర్:**
రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు పురంద్రీశ్వరికి ఈ టర్మ్ లో కీలక పదవి దక్కే అవకాశం లేనట్లే ఉంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణ జరిగినప్పుడల్లా ఆమె పేరు పదే పదే వినిపించడం చివరి నిమిషంలో దక్కకపోవడం జరుగుతుంది. ఈసారి కూడా అదే జరుగుతుందోమేనన్న ఆందోలన చిన్నమ్మ అభిమానుల్లో ఉంది. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలోపురంద్రీశ్వరికి మళ్లీ పదవి దక్కుతుందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. కానీ కష్టమేనని చెబుతున్నారు. అందుకు అనేక కారణాలున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ఎన్టీఆర్ కుమార్తెగా ఆమె పార్టీ కోసం బాగా పనిచేసినప్పటికీ కొన్ని కారణాలు ఆమె పదవికి అడ్డం పడుతున్నాయన్నది హస్తిన వర్గాల నుంచి అందుతున్న సమాచారం. 2024లో కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆమె కేంద్ర మంత్రి పదవి వస్తుందని అనుకున్నారు. కానీ నర్సాపురం పార్లమెంటు సభ్యుడు శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రివర్గంలోకి అనూహ్యంగా తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీకి మాత్రం రెండు పదవులు లభించాయి. తెలంగాణలో ఎనిమిది స్థానాలను గెలవడంతో ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. టీడీపీ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న గుంటూరు పార్లమెంటుసభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ ప్రధాన కారణం. ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించే ఛాన్సులు అయితే లేవు. ఎందుకంటే పెమ్మసాని లోకేశ్ కు, చంద్రబాబుకు అత్యంత ఆప్తుడు. పెమ్మసాని కమ్మ సామాజికవర్గం కావడంతో ఇకపురంద్రీశ్వరికి ఆకోటాలో మంత్రివర్గంలో చోటు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఇక జాతీయ అధ్యక్ష పదవి అనికొన్నాళ్లు పురంద్రీశ్వరి పేరు వినిపించింది. కానీ అది సాధ్యం కాలేదు. తర్వాత స్పీకర్ పదవి అన్నారు. ఓంబిర్లాను ఆ పదవి నుంచి తప్పించే అవకాశాలు లేవు. పురంద్రీశ్వరి కి కేంద్రంలో కీలకమైన పదవులు ఈసారి అంటే రానున్న మూడేళ్ల కాలంలో దక్కే అవకాశం లేదన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి, ఇక్కడ పురంద్రీశ్వరి ఎంపీగా మరొకసారి విజయం సాధిస్తే అప్పుడు చూడొచ్చులే అన్న ధోరణిలో కేంద్ర నాయకత్వం ఉందని తెలిసింది. మొత్తం మీద చిన్నమ్మకు ఈ టర్మ్ లో మాత్రం ఎటువంటి పదవులు.. ఇటు ప్రభుత్వంలో కానీ, అటు పార్టీలో కానీ దక్కే అవకాశాలు లేవన్నది వాస్తవం. అందుకే పురంద్రీశ్వరి రాజమండ్రి నుంచి మరోసారి గెలిచేందుకు బేస్ ను పటిష్టం చేసుకునేందుకే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు



# రతనాల సీమగా మారుతున్న రాయలసీమ

**తిరుపతి, జూలై 11, పెన్ పవర్:**
ఫ్యాక్షన్ గొడవలు.. బాంబులు.. కొట్లాటలు.. ప్రాణాలు తీయడాలు.. ఇవి సినిమాలో మాత్రమే కాదు.. రాయలసీమలో రియల్ గా జరిగేవి. ఐదు రూపాయల కోసం దారుణాలు జరుగుతాయని ఓ సినిమాలో చూపించారంటే.. రాయలసీమలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు . ఒకప్పుడు శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించిన రాయలసీమ.. కరువుకు కేరాఫ్ అడ్రస్. వలసలకు కేరాఫ్ అడ్రస్. దారిద్రానికి కేరాఫ్ అడ్రస్. కానీ ఇప్పుడు మారిపోయింది. కూటం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాయలసీమ తనముఖ చిత్రాన్ని ఈసారి పూర్తిగా మార్చుకుంటున్నది. ఒక నివేదిక ప్రకారం రాయలసీమ ప్రాంతంలో సుమారు 4.58 లక్షల పెట్టుబడులను కంపెనీలు పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ ఏకంగా 275 పారిశ్రామిక ప్రాజెక్టులు వివిధ దశలో ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా బెంగళూరు, కర్ణాటక సరిహద్దు చుట్టుపక్కల ప్రాంతాలు వివిధ రంగాల పెట్టుబడులతో నిరంతరం అభివృద్ధి చెందుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ కర్ణాటకసరిహద్దు ప్రాంతంలో ఉంటుంది. ఒకప్పుడు ఏమో గాని.. ఇప్పుడైతే అత్యంత ఆశాజనకమైన అభివృద్ధి ప్రాంతాలలో ఒకటిగా నిలవబోతోంది. ఒకప్పుడు ఈ ప్రాంతం కరువు భూమిగా పేరుగాంచింది. ఇప్పుడు పునర్పాదక ఇంధనం.. తయారీరంగం.. లాజిస్టిక్స్.. వంటి రంగాలలో మొత్తంగా 275 పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయి. ఫలితంగా రాయలసీమ దక్షిణ భారతదేశంలోనే అత్యంత పెద్దదైన పారిశ్రామిక కేంద్రంగా రూపాంతరం చెందబోతోంది.రాయలసీమ లో అన్నమయ్య.. సత్యసాయి.. అనంతపురం.. నంద్యాల.. కడప.. కర్నూలు.. తిరుపతి వంటి ఏడు జిల్లాలు ఉన్నాయి.. ఈ ఏడు జిల్లాలు బెంగళూరు.. హైదరాబాద్.. చెన్నై నగరాలతో అనుసంధానం చేసే జాతీయ ప్రధాన రహదారులను కలిగి ఉన్నాయి. అనంతపురం కర్ణాటక సరిహద్దుకు 55 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సత్య సాయి పుట్టపర్తి 75 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో హిందూపూర్ కర్ణాటక రాష్ట్ర సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కర్నూలు 95 కిలోమీటర్లు.. నంద్యాల 150 కిలోమీటర్లు.. కడప 150 కిలోమీటర్లు.. అన్నమయ్య 140 కిలోమీటర్లు.. తిరుపతి 2.0 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.4.5 లక్షల కోట్ల పెట్టుబడి ద్వారా మొత్తంగా 3.57 లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలుస్తోంది.. పునరుత్పాదక శక్తి తయారీ.. ఎలక్ట్రానిక్స్.. ఆహార శుద్ధి.. సిమెంట్.. లాజిస్టిక్స్.. వస్త్ర పరిశ్రమ వంటి రంగాలలో ఇక్కడ కర్మాగారాలు ఏర్పాటు కాబోతున్నాయి. అతిపెద్దదైన సౌర. పవన విద్యుత్ ప్రాజెక్టులకురాయలసీమ కేంద్రంగా మారబోతోంది.గ్రీన్కో సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కర్నూలులోని పిన్నపురం ప్రాంతంలో ఏర్పాటు కాబోతోంది. ఈ ప్రాజెక్టు మీద గ్రీన్కో కంపెనీ 30 వేల కోట్లకు పైగాపెట్టుబడి పెడుతోంది.. ఈ ప్రాజెక్టు మొత్తం 5230 మెగా వాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. ఇందులో మూడు వేల మెగావాట్లు సౌర విద్యుత్.. 550 మెగావాట్లు పవన, 1680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీలుఉన్నాయి.జటటఎస్ డ బ్ల్యూ రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారం. కడప ప్రాంతంలో రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారాన్ని నిర్మించేందుకు జటటఎస్ డ బ్ల్యూ స్టీల్ 16,350 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ కర్మాగారం ప్రారంభ సామర్థ్యం 2 ఎంటీపీఏ గా ఉంది. భవిష్యత్ కాలంలో అది 5 ఎంటీపీఏ కు విస్తరించే అవకాశం ఉంది. దీనిద్వారా పదివేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది.సత్యసాయి అనంతపురం జిల్లాలో 72 గిగా వాట్ల సామర్థ్యంతో సోలార్ పార్కులు ఏర్పాటు కాబోతున్నాయి. ఇందులో మడకశిర సోలార్ పార్క్ ఏడువేల కోట్లతో ఏర్పాటు కాబోతోంది. యశస్వ పవర్ ప్రాజెక్ట్ 2 మెగా వాట్లు.. ఎన్టిపిసి సోలార్ పార్క్ 1.2 గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు కాబోతోంది.సత్యసాయి జిల్లాలో 51,300 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో రాయలసీమలోనే అతిపెద్ద సౌర ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఇవిమాత్రమే కాకుండా ఇండి చిప్ సెమీ కండక్టర్ ప్రాజెక్ట్ కర్నూలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతోంది. 14,000 కోట్ల పెట్టుబడితో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండు నుంచి మూడు సంవత్సరాల వ్యవధిలోనెలకు 10,000 నుంచి 50 వేల వేపర్లను ఇక్కడ ఉత్పత్తి చేస్తారుతిరుపతిలో 2,500 కోట్ల వ్యయంతో రాయల్ ఎన్ఫీల్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు కాబోతోంది. కంపెనీ వార్షిక ఉత్పత్తికి అదనంగా 9 లక్షల మోటారు సైకిళ్లను తయారుచేస్తారు. 5000 నుంచి 15వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.క్యారియర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ.. శ్రీ సిటీ ప్రాంతంలో 1000 కోట్ల ఖర్చుతో కొత్త ప్లాంట్ ఏర్పాటుకాబోతోంది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి ప్రాంతంలో లక్ష కోట్ల విలువైన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయబోతున్నారు. దక్షిణ కొరియాలోని పేరుపొందిన పాదరక్షల తయారీ సంస్థ హ్వా సింగ్ అనేకంపెనీ 898 కోట్ల పెట్టుబడితో చిత్తూరులో తన మొట్టమొదటి భారతీయ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది. మొత్తంగా 17,000 మందికి ఉద్యోగాలు కల్పించబోతోంది.రిలయన్స్ రిటైల్ పానీయాలకేంద్రం కర్నూల్ లోని ఓర్వకల ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో వందల కోట్ల పెట్టుబడి పెట్టాలని చూస్తోంది. 5000 మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉద్యోగాలు ఇవ్వబోతోంది.

# పెద్దాయన రాయలసీమ గళం విప్పుతారా ?

ఏపీలో అతి ముఖ్యమైన రీజియన్ గా రాయలసీమ ఉంది. రాయలసీమ ప్రాంతం ఆంధ్ర రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి మద్రాస్ స్టేట్ లో ఉండేది. అయితే ప్రత్యేక రాష్ట్రంగా ఏపీ ఆవిర్భవించాలనుకున్నపుడు మొదట్లో రాయలసీమ కలసిరాలేదు. మాకు మద్రాస్ స్టేట్ తో బాగానే ఉంది అని కూడా అనుకుంది. చివరికి శ్రీభాగ్ ఒప్పందం మేరకు రాయలసీమ కూడా కలసి వచ్చింది. దాని ప్రకారం చూస్తే కొత్త స్టేట్ లో రాజధాని అయినా లేదా హైకోర్టు అయినా తమకు ఉండాలని కోరినట్లుగా ఒప్పందంలో ఉంది. ఇక 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు కర్నూల్ రాజధాని అయింది. గుంటూరులో హైకోర్టు ఏర్పాటు అయింది. తిరిగి 2014లో ఉమ్మడి ఏపీ విడిపోయినపుడు రాజధాని అయినా హైకోర్టు అయినా ఏదో ఒకటి దక్కాలని అనుకున్న అది జరగలేదు. అయితే కూటమి ప్రభుత్వం హైకోర్టు బెంచ్ ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అంతే కాదు రాయలసీమను రతనాల సీమను చేస్తామని కూడా చెబుతూ ఆ దిశగా చర్యలను చేపడుతోంది.

**సాగు నీటి ప్రాజెక్టులు :**
అదే విధంగా చూస్తే రాయలసీమకు సాగు తాగు నీటి కొరత ఉంది. వాటి విషయంలో పాలకులు ఆలోచన చేయాలని కూడా ఉంది. అలాగే ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఉపాధి అవకాశాలు మాత్రం పెద్దగా పెరగడం లేదు. అదే సమయంలో పరిశ్రమలు వస్తున్నాయని అంటున్నా రాయలసీమలో అనేక సమస్యలు ఉన్నాయని అంటున్నారు. దాంతో రాయలసీమ విషయంలో ఇంకా అసంతృప్తి స్వరాలు గట్టిగా వినిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి మైసూరారెడ్డి అయితే రాయలసీమ విషయంలో తన స్థిరరమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక యూ ట్యూబ్ చానల్ లో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు తగిన న్యాయం జరగాలని కోరుకున్నారు.

**ఇద్దరూ ఏమీ చేయలేదు :**
రాయలసీమ ప్రాంతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కానీ మాజీ సీఎం వైఎస్ జగన్ కానీ ఏమీ చేయలేదని మైసూరారెడ్డి విమర్శించారు. రాయలసీమలో అనేక సమస్యలు ఉన్నాయని ఆయన అన్నారు. వాటి కోసం అంతా కృషి చేయాలని పరిష్కరించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే రాయలసీమ సమస్యల పట్ల మళ్ళీ తన గళాన్ని వినిపించాలని మైసూరారెడ్డి ఆలోచిస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. రాయలసీమ అభివృద్ధి మీద అయితే ఇప్పటికీ అంతా అసంతృప్తిగానే ఉన్నారు. పాలకులు మారినా ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా వెనకబాటు తనం పోవడం లేదన్న బాధ అయితే అందరిలో ఉంది.

## అయ్యయ్యో.. 3 మ్యాచ్‌లు ఫెయిల్.. అయినా వైభవ్‌ను వదలొద్దంటున్న మాజీ కోచ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో వచ్చి అవకాశాలని అందుకోవడంతో 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ వైఫల్యం చెందడంపై క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున సంచలన ప్రదర్శనతో, టీమిండియాలో చోటు దక్కించుకున్న ఈ బీహార్ కుర్రాడు.. ఇంగ్లాండ్ పిచ్‌లపై పరుగులు సాధించడానికి చాలా కష్టపడుతున్నాడు. బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20లో ఇండియా ఓడిపోగానే కోచ్ గౌతమ్ గంభీర్ స్టేడియంలోనే వైభవ్‌తో సీరియస్‌గా మాట్లాడిన వీడియో వైరల్ అయింది. ఇక భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ హెడ్ కోచ్ డబ్ల్యూవీ రామన్ మాట్లాడుతూ

**వైభవ్ ఆటపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.**

వైభవ్‌కి 20 మ్యాచ్‌లు ఆడే ఛాన్స్ ఇవ్వండి: రామన్

రెవ్‌స్పోర్ట్స్ ఇంటర్వ్యూలో డబ్ల్యూవీ రామన్ మాట్లాడుతూ.. వైభవ్ సూర్యవంశీ టాలెంట్‌ను కేవలం ఒకే ఒక్క సిరీస్ స్కోర్లతో అంచనా వేయడం తగదన్నారు. సెలెక్టర్లు అతనిలోని అసలైన ప్రతిభను చూసే భారత జట్టుకు ఎంపిక చేశారని, కాబట్టి ఏమాత్రం జడ్జ్ చేయకుండా అతనికి కనీసం 15 నుంచి 20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో వరుసగా అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రత్యర్థి బౌలర్లు కొత్త ప్లేయర్స్ బలహీనతలను త్వరగా పసిగడతారని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నిరంతరం అవకాశాలు ఇస్తేనే కుర్రాడికి ఆత్మవిశ్వాసం పెరిగి భవిష్యత్తులో అద్భుతాలు చేస్తాడని రామన్ ధీమా వ్యక్తం చేశారు.

**సచిన్ రికార్డ్ బ్రేక్.. జోఫ్రా ఆర్చర్ దెబ్బతో వైభవ్ విలవిల:**

ఈ నెల ప్రారంభంలో ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరిగిన రెండో టీ20లో వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్సులో (15 ఏళ్లకే) అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆటగాడిగా నిలిచి, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న సుదీర్ఘ రికార్డును బద్దలు కొట్టాడు. అయితే ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ అదనపు పేస్, షార్ట్ పిచ్ బంతులతో ఈ యువ లెఫ్ట్ హ్యాండ్‌ను ముప్పతిప్పలు పెడుతున్నారు. ఇప్పటి వరకు ఆడిన మ్యాచ్‌ల్లో వైభవ్ మంచి ఆరంభాలు లభించినా భారీ స్కోర్లు చేయలేకపోయాడు. రెండో మ్యాచ్‌లో 14 రన్స్, మూడో మ్యాచ్‌లో 13 పరుగులు, నాలుగో మ్యాచ్‌లో 15 రన్స్ చేసి తర్వాగానే వికెట్ పారేసుకున్నాడు.

**సౌతాంప్టన్‌లో కుర్రాడికి చివరి ఛాన్స్:**

వైభవ్ సూర్యవంశీ ప్రస్తుత ఫామ్ అతడికి శాపంగా మారింది. ఈరోజు సౌతాంప్టన్ వేదికగా జరగబోయే ఆఖరి ఐదో టీ20 మ్యాచ్‌లో వైభవ్ తన తప్పులను సరిదిద్దుకుని భారీ ఇన్నింగ్స్ ఆడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. గంభీర్ ఇచ్చిన క్లాస్ రూమ్ టిప్స్ పాటిస్తూ ఈ బీహార్ కుర్రాడు ఇంగ్లీష్ బౌలింగ్‌ను ఎలా ఎదుర్కొంటాడో చూడాలి మరీ.

# మళ్లీ టాస్ గెలిచిన భారత్.. ఈసారి సంజు ఎంట్రీ.. ఫస్ట్ బ్యాటింగ్ ఇంగ్లాండ్‌దే




**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాంప్టన్ వేదికగా భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరుగుతన్న ఐదో టీ20 మ్యాచ్ టాస్ పడింది. ఈ చారిత్రాత్మక పోరులో టాస్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మొదట ఫీల్డింగ్ తీసుకున్నాడు. కాగా ఈ మ్యాచ్ గెలిచి ఐసీసీ ర్యాకింగ్స్ లో నెంబర్ స్థానాన్ని దక్కించుకోవాలని ఇంగ్లాండ్ చూస్తుండగా, ఇంగ్లీష్ జట్టుని ఓడించి, పరువు కాపాడుకోవాలని టీమిండియా చూస్తుంది. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. పిచ్ పరిస్థితి మ్యాచ్ గడిచేకొద్దీ పెద్దగా మారదని, ఇంగ్లాండ్ నిర్దేశించే లక్ష్యాన్ని చేజ్ చేయడానికే తాము మొగ్గు చూపుతున్నట్లు తెలిపాడు. ఇప్పటికే సిరీస్ కోల్పోయినప్పటికీ, గతంలో జరిగిన పరాజయాల గురించి ఆలోచించకుండా ఆటగాళ్లు మంచిగా ఆడాలని చెప్పుకొచ్చాడు. ఇక తుది జట్టులో భారత్ రెండు కీలక మార్పులు చేసింది. గత కొన్ని మ్యాచ్‌లుగా బెంచ్‌కే పరిమితమైన సంజు శాంసన్ తో పాట సూర్యాంష్ షెడ్గేకు ప్లేయింగ్ 11లో అవకాశం కల్పించినట్లు శ్రేయస్ వెల్లడించాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మాట్లాడుతూ.. ఈ మ్యాచ్‌లో గెలిస్తే తాము ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని, ఆ ఆలోచన తన మనస్సులో బలంగా నాటుకుపోయిందని బ్రూక్ చెప్పుకొచ్చాడు. భారత్‌ను 4--0తో క్లీన్ స్వీప్ చేసి అగ్రస్థానాన్ని దక్కించుకోవడమే తమ ఏకైక లక్ష్యమని తేల్చి చెప్పాడు. ఇంగ్లాండ్ జట్టు ఎలాంటి మార్పులు లేకుండా అదే విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతోందని హ్యారీ పేర్కొన్నాడు.

**ఇరు జట్లు:**

భారత్: అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్( కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ

ఇంగ్లాండ్: ఫిలిప్ సాల్ట్, జోస్ బట్లర్(వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్(కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కర్రాన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్

## వరుసగా మూడు మ్యాచుల్లో ప్లాఫ్ షో.. ఐదో టీ20లో బుడ్డోడిపై బీసీసీఐ వేటు..!




**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాంప్టన్ వేదికగా ఇంగ్లాండ్?తో జరుగుతోన్న ఐదో టీ20లో ఇండియా టాస్ గెలిచింది. దీంతో టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ నామమాత్రపు మ్యాచులో భారత్ జట్టు రెండు మార్పులతో బరిలోకి దిగింది. ఆల్ రౌండర్ వాషింగ్టన్ స్థానంలో యంగ్ ప్లేయర్ సూర్యాన్ష్ షెడ్గే జట్టులోకి వచ్చాడు. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్లేసులో స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ప్లేయింగ్ లెవన్?లో చోటు దక్కించుకున్నాడు.

**వైభవ్ హ్యాట్రిక్ ప్లాఫ్ షో:**

ఐపీఎల్ 2026లో దుమ్మురేపిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇంగ్లాండ్ టూర్?కు ఎంపికైన సంగతి తెలిసిందే. కానీ జట్టు కూర్పులో భాగంగా ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్?లో ఈ బుడ్డోడికి ఆడే అవకాశం రాలేదు. అయితే, భారత్ అనూహ్యంగా ఈ సిరీస్ కోల్పోయింది. ఐర్లాండ్ సిరీస్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ దారుణంగా విఫలయ్యాడు. దీంతో జట్టు నుంచి సంజూను తప్పించి వైభవ్‌కు చాన్స్ ఇవ్వాలని పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపించాయి.

ఇదే సమయంలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో కూడా ఈ వరల్డ్ కప్ హీరో ఫెయిల్ అయ్యాడు. దీంతో సంజూపై వేటు వేసిన బీసీసీఐ.. వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పించింది. భారీ అంచనాలతో అంతర్జాతీయ అరంగ్రేటం చేసిన వైభవ్ అంచనాల మేర రాణించలేదు.

వరుసగా మూడు మ్యాచుల్లో తక్కువ స్కోర్లకే పరిమితమయ్యాడు. ఇంగ్లాండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ వైభవ్ బలహీనతను కనిపెట్టి దెబ్బకొట్టాడు. ఇదే సమయంలో టీమిండియాకు టీ20 వరల్డ్ కప్ అందించిన సంజూ శాంసన్?ను బీసీసీఐ అవమానిస్తోందని.. అతడిని జట్టులోకి తీసుకోవాలని డిమాండ్లు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో హ్యాట్రిక్ ప్లాఫ్ షో చేసిన బుడ్డోడిని పక్కనపెట్టి ఐదో టీ20కి సంజూ శాంసన్?ను ఎంపిక చేసింది.

# మహేష్ గ్లోబల్ జర్నీ తో టాలీవుడ్ మరో మెట్టు పైకి!



రోష్నీ వాలియా అద్భుతమైన చీరకట్టు లుక్



తెలుగు చిత్రసీమ దశాబ్దాలుగా ఎన్నో మార్పులకు లోనవుతున్నా? ప్రస్తుత తరుణంలో సూపర్ స్టార్ మహేష్ చేపట్టిన గ్లోబల్ జర్నీ టాలీవుడ్ స్థాయిని మరో మెట్టు పైకి ఎక్కిస్తుందన్నది కాదనలేని నిజం. ఒక ప్రాంతీయ స్టార్‌గా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సినిమాలను ఎంచుకోవడం ద్వారా మహేష్ పరిశ్రమ గమనాన్ని మారుస్తున్నారు. రాజమౌళి - మహేష్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న గ్లోబల్ ప్రాజెక్ట్ -వారణాసి- ప్రపంచ సినిమా పటంలో తెలుగు సినిమాకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తుంది. మహేష్ లో ఉన్న సహజ సిద్ధమైన హాలీవుడ్ స్టార్ ఫీచర్స్ అదనపు బలాన్ని ఇస్తున్నాయి.

ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ యాక్షన్ హీరోగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి నటుడిగా కనిపించే పరిణతి, గ్లోబల్ ఆడియెన్స్‌ను ఆకట్టుకోవడానికి ప్లస్‌గా మారుతున్నాయి. మహేష్ బాడీ లాంగ్వేజ్, ఫ్యాషన్ సెన్స్ కెమెరా ముందు ప్రదర్శించే హావభావాలు హాలీవుడ్ సినిమాల్లో కనిపించే స్థాయి నటనకు ఏమాత్రం తక్కువ కాదని చెప్పొచ్చు. ముఖ్యంగా జర్మనీ వంటి దేశాల్లో కఠినమైన శిక్షణ తీసుకోవడం, సినిమా కోసం తనను తాను పూర్తిగా మార్చుకోవడం వంటివి మహేష్ అంకితభావాన్ని చాటుతున్నాయి. నటుడిగా తన పరిధిని విస్తరించుకోవాలని మహేష్ చేస్తున్న ప్రయత్నం టాలీవుడ్ లో మిగతా స్టార్ హీరోలకు కూడా ఓ కొత్త దారిని చూపి స్తోంది.ఇలాంటి క్రమశిక్షణతో కూడిన ప్రయాణం భవిష్యత్తులో మరింత మంది స్టార్ హీరోలు అంతర్జాతీయ వేదికలపై స్థిరపడటానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని సినిమాలు రూపొందించడం తో టాలీవుడ్ సినిమాల బడ్జెట్ .. సాంకేతిక ప్రమాణాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. మహేష్ ఎంచుకుంటున్న కథాంశాలు కేవలం ఒక వర్గానికి పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ఉంటున్నాయి. ఇది తెలుగు నిర్మాతలు, దర్శకులు , సాంకేతిక నిపుణులకు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవడానికి గొప్ప వేదికను అందిస్తోంది.ఈ మార్పు తో టాలీవుడ్ చిత్రాలకు దక్కుతున్న ఆదరణ బాక్సాఫీస్ వసూళ్లను మాత్రమే కాకుండా పరిశ్రమ గౌరవాన్ని కూడా పెంచుతోంది. గ్లోబల్ స్థాయిలో తెలుగు సినిమాలకి వస్తున్న గుర్తింపు భారతీయ సినిమా వైపు ప్రపంచం చూసేలా చేస్తోంది. మహేష్ లాంటి గ్లోబల్ ఐకాన్ లీడ్‌లో ఉండటం వల్ల అంతర్జాతీయ పంపిణీదారులు .. థియేటర్ల యజమానులు చిత్రాలను ప్రదర్శించడానికి ముందుకొస్తున్నారు. -వారణాసి- ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల్లో విడుదల చేస్తోన్న తీరు..రాజమౌళి గ్లోబల్ ఇమేజ్ తోనే ఇదంతా సాధ్యమవుతుంది.

చివరిగా మహేష్ గ్లోబల్ జర్నీ టాలీవుడ్ కు కొత్త శకాన్ని పరిచయం చేస్తోంది. ఆయనలోని స్టార్ ఫీచర్స్ , ప్రపంచ స్థాయి కథాంశాల కలయిక తెలుగు సినిమాను గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద విజేతలుగా నిలబెడుతుంది. రాబోయే రోజుల్లో మహేష్ ప్రాజెక్టులు తెలుగు సినిమా స్థాయిని ఎలా? అంతర్జాతీయ శిఖరాలకు చేరుస్తాయో వేచి చూడాలి.



వర్షపు చినుకులతో తడిసిన తెల్లని దుస్తుల్లో షామా సికందర్ రూపం ఎంతో హుందాగా ఉంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965